PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 027 | మంగళవారం | 21-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajgiri | Volume : 01 | Issue : 027 | Tuesday | 21-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri



## విద్యార్థులపై టియర్‌గ్యాస్ ఎందుకు?

• నిరసన హక్కు గౌరవించాలన్న రాహుల్

ఢిల్లీలో విద్యార్థులపై టియర్‌గ్యాస్ ప్రయోగించడం, లాఠీచార్జ్ చేయడాన్ని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను నేరస్తుల్లా చూడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఇలాంటి చర్యలు భారతదేశ సంప్రదాయం కాదని, ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు.



## సీజేపీతో కేంద్రం చర్చలు

• దీక్ష విరమించాలంటూ విజ్ఞప్తి! • నడ్డా నివాసంలో కీలక సమావేశం

నీట్-యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కొనసాగుతున్న సీజేపీ ఆందోళనల మధ్య కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చింది. కేంద్ర మంత్రి జేపీ నడ్డా నివాసంలో సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాతో కీలక సమావేశం జరిగింది. ఈ భేటీ సానుకూల వాతావరణంలో జరిగినట్లు నడ్డా వెల్లడించారు. చర్చల అనంతరం ఆందోళన విరమించి సాధారణ పరిస్థితులు పునరుద్ధరించేందుకు సహకరించాలని నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు.



# కాక్రోచ్‌ల ముట్టడి.. దద్దరిల్లిన ఢిల్లీ

• సీజేపీ మార్చ్ అడ్డుకున్న పోలీసులు! • భారీగా తరలివచ్చిన యువత

దేశ రాజధాని ఢిల్లీలో సీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ఉద్రిక్తంగా మారింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాల నిపుణులు జంతర్‌మంతర్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వరకు భారీ మార్చ్ చేపట్టాలని నిర్ణయించారు. ముందుగానే అనుమతి నిరాకరించిన ఢిల్లీ పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేసి అన్ని మార్గాలను దిగ్బంధించారు.

### బారికేడ్ల వద్ద ఉద్రిక్తత

మార్చ్ ప్రారంభమైన వెంటనే నిరసనకారులు బారికేడ్ల వరకు చేరుకున్నారు. వాటిని దాటేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో తోపులాటలు జరిగాయి. లాఠీచార్జ్‌లో పలువురు గాయపడ్డారని నిరసనకారులు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు వెంటనే స్పందించలేదు. బారికేడ్లను దాటలేక చాలామంది రోడ్డుపైనే కూర్చొని జాతీయ జెండాలు ఊపుతూ నినాదాలు చేశారు. మరికొందరు చిన్న చిన్న బృందాలుగా విడిపోయి పార్లమెంట్ చేరుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయత్నించారు. భారీ వర్షం కురిసినా నిరసనకారులు వెనక్కి తగ్గలేదు. స్వచ్ఛంద కార్యకర్తలు నీలిరంగు టార్పాలిన్‌లు ఏర్పాటు చేసి వర్షం నుంచి రక్షణ కల్పించారు. ఆహారం, తాగునీరు పంపిణీ చేశారు. దేశభక్తి గీతాలు వినిపిస్తుండగా నిర్వాహకులు శాంతియుతంగా నిరసన కొనసాగించాలని పదేపదే పిలుపునిచ్చారు. పోలీసులు రెచ్చగొట్టినా స్పందించవద్దని సూచించారు.

వివరాలు 3లో..



# మోదీ మాట.. రాహుల్ తూటా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాకముందే దేశ రాజకీయాలు మరోసారి మోదీ వర్సెస్ రాహుల్ చర్చతో వేడెక్కాయి. ప్రధాని నరేంద్ర మోదీ "56 ఏళ్ల యువకుడు" అంటూ చేసిన పరోక్ష వ్యాఖ్యలు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకున్నవేనన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు విద్యార్థులపై టియర్‌గ్యాస్, లాఠీచార్జ్ ఘటనలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దీంతో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం పార్లమెంట్‌కు ముందే తారాస్థాయికి చేరింది. ఒకవైపు స్కైరూట్ ఏరోస్పేస్ విజయాన్ని యువ భారత ప్రతిభకు ప్రతీకగా చూపిస్తూ ప్రధాని ఆశావహ సందేశం ఇస్తే, మరోవైపు నిరుద్యోగం, పేపర్ లీకులు, విద్యార్థుల భద్రత వంటి సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. వ్యక్తిగత సెటైర్లు, రాజకీయ ప్రత్యుత్తరాలు, యువత సమస్యలు, పార్లమెంట్ వ్యూహాలు అన్నీ ఒకే వేదికపైకి రావడంతో జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర సమీకరణాలు కనిపిస్తున్నాయి. ఇక సభలో ఈ రెండు పక్షాలు ఏ అంశాలను ముందుకు తీసుకువస్తాయి? రాజకీయ విమర్శలు ఎంత దూరం వెళ్తాయి? ప్రజా సమస్యలపై చర్చకు ఎంత ప్రాధాన్యం లభిస్తుంది? అనే అంశాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్నాయి. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాకముందే మోదీరాహుల్ పోరు దేశ రాజకీయాలకు హాట్ టాపిక్‌గా మారింది.

## 56 ఏళ్ల యువకుడు

• రాహుల్‌పై మోదీ సెటైర్! • పార్లమెంట్ ముందే రాజకీయ చురకలు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ సాధించిన విజయాన్ని అభినందిస్తూ మాట్లాడిన ప్రధాని, పరోక్షంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై సెటైర్లు వేశారు. (వివరాలు 7లో..)

## దీక్ష ఆపేదే లేదు

- వాంగ్‌చుక్ స్పష్టమైన హెచ్చరిక
- యువతకు మద్దతు కొనసాగిస్తా
- 23వ రోజుకు చేరుకున్న నిరాహార దీక్ష

పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన, విద్యార్థి నాయకులకు పార్లమెంట్ సభ్యులను కలిసే అవకాశం కల్పించే వరకు లేదా ఎంపీలు తనను ఆస్పత్రిలో కలిసి వారి సమస్యలు వినే వరకు దీక్ష విరమించబోనని ప్రకటించారు. ఈ మేరకు ఆయన స్వహస్తాలతో రాసిన లేఖను భార్య గీతాంజలి ఆంగ్మో సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు.

## సీజేపీ ఉద్యమం ఎందుకు?

- వ్యంగ్యం నుంచి ప్రజా ఉద్యమం
- ఢిల్లీ వీధుల్లో వేలాదిగా యువత

దేశ రాజధాని ఢిల్లీలో వేలాది మంది యువత వీధుల్లోకి రావడంతో రాజకీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు కొనసాగుతున్నాయి. కొద్ది నెలల క్రితం సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్య ఉద్యమంగా ప్రారంభమైన ఈ వేదిక ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద యువజన ఉద్యమాల్లో ఒకటిగా మారింది. జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు నిరసనలు విస్తరించాయి.






## ఢిల్లీలో ఇప్పుడేం జరుగుతోంది

- కొనసాగుతోన్న సీజేపీ ఉద్యమం
- లాఠీచార్జ్ తర్వాత ఉద్రిక్తత
- మార్చ్‌కు పోలీసుల అడ్డుకట్ట

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ చేపట్టిన "సంసద్ చలో" మార్చ్ ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు వెళ్లాలని ప్రయత్నించిన వేలాది మంది నిరసనకారులను ఢిల్లీ పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.




## నిన్న ఆత్మహత్య.. నేడు మద్యం మత్తు!

• ప్రచారం పరుగెత్తింది.. నిజం నడిచొచ్చింది

పోలీస్ అంటే ఆధారాలు చూసి కేసు నమోదు చేసే వ్యవస్థ. కానీ ఈసారి పోలీస్ అకాడమీకి చెందిన ఓ ట్రైనీ ఐపీఎస్ వ్యవహారంలో మాత్రం ఆధారాల కంటే ముందే ప్రచారమే పరుగు తీసింది. నిన్నటి వరకు "ఆత్మహత్యాయత్నం" అంటూ సంచలన శీర్షికలు మార్మోగాయి. సస్పెన్షన్.. లైంగిక వేధింపుల కేసు.. ప్రాణాలపై విరక్తి.. అంటూ కథలు క్షణాల్లో సోషల్ మీడియాను చుట్టేశాయి. కానీ ఒక్క వైద్యుల నివేదిక వచ్చేసరికి మొత్తం కథనం ఒక్కసారిగా తలకిందులైంది. విషం కాదు.. అధిక మద్యం సేవించడమే స్పృహ కోల్పోవడానికి కారణమని డాక్టర్లు తేల్చడంతో "నిన్న అలా.. నేడు ఇలా" అనే పరిస్థితి కనిపించింది. వార్తల ప్రపంచంలో ఊహాగానాలు ఎంత వేగంగా పరిగెడతాయో, వాస్తవాలు అంత నెమ్మదిగా నడుస్తాయనే మరో ఉదాహరణగా ఈ ఘటన నిలిచింది. అయితే ఇక్కడ అసలు కేసు మాత్రం ఇంకా ముగియలేదు. మహిళా ట్రైనీ ఐపీఎస్ చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు, వాటిపై నమోదైన పోలీసు కేసు, అకాడమీ అంతర్గత విచారణ యథావిధిగా కొనసాగుతున్నాయి. ఆరోపణలు చేసినవారి వాదన ఒకవైపు.. ఆరోపణలను ఖండిస్తున్న ట్రైనీ ఐపీఎస్ వివరణ మరోవైపు.. ఇప్పుడు నిజం ఏంటో చెప్పేది దర్యాప్తే. కోర్టు లేదా విచారణ తుది నిర్ణయం వెలువడకముందే తీర్పులు చెప్పే సోషల్ మీడియా కోర్టులు, సంచలన శీర్షికల పోటీ మరోసారి ప్రశ్నార్థకంగా మారాయి. ఈ ఘటన ఒక విషయాన్ని మాత్రం స్పష్టం చేసింది.. ప్రచారం ఒక్క క్షణంలో పుడుతుంది, కానీ నిజం మాత్రం ఆధారాలతోనే బయటపడుతుంది.




## ఊహాగానాలకు చెక్ అస్సలు పార్టీ మారను

- మల్లన్న మాటంటే మాటే
- పార్టీ మార్పు ప్రచారానికి ఫుల్‌స్టాప్
- బీఆర్ఎస్‌లోనే ఉంటానన్న మల్లారెడ్డి!

## కాంగ్రెస్‌తో.. అన్ని వర్గాలకు మోసం

- బాన్సువాడలో పోచారానికి చెక్
- గులాబీ జెండా ఎగరాలన్న కేటీఆర్!

బాన్సువాడలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరాలని పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరీల్ శ్రీనివాస్ రావుతో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. (వివరాలు 2లో..)






## ఎంత అన్యాయం..

- సర్‌తో బీజేపీ ఓట్లే ఎత్తేస్తారా?
- సీఈవోకు బీజేపీ ఫిర్యాదు
- ఓటర్ల నమోదులో అక్రమాలు?
- కేంద్ర బలగాలు కావాలన్న నేతలు



## కాళేశ్వరంపై అబద్ధాల ప్రచారం

- బీఆర్ఎస్‌కు ఉత్తమ్ ఘాటు రిప్లై

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. నల్గొండలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వాస్తవాలను పక్కనబెట్టి రాజకీయ ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన ఎవరి హయాంలో జరిగింది, నిర్మాణ లోపాలు ఎప్పుడు బయటపడ్డాయో ప్రజలు గమనించాలని సూచించారు. (వివరాలు 2లో..)

## బహదూర్‌గూడ భూములపై స్టే

• 28 ఎకరాలపై కీలక ఆదేశం • హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

శంషాబాద్ మండలం బహదూర్‌గూడలోని వివాదాస్పద భూముల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాల భూమికి సంబంధించిన వివాదంపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ ఆదేశాలు ఇచ్చింది. దీంతో ప్రస్తుతం ఆ భూముల విషయంలో ప్రభుత్వ చర్యలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. (వివరాలు 2లో..)




## కొత్త ఇందిరమ్మ ఇళ్ల నుంచే.. వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తాం

16 నియోజకవర్గాల్లో తొలి దశ • ఒక్కో నియోజకవర్గంలో 500

• సిటిలో 8 వేల ఇళ్ల నిర్మాణాలు • వివరాలు వెల్లడించిన పొంగులేటి

హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. త్వరలో మరో 8 నియోజకవర్గాలకు కూడా ఈ పథకాన్ని విస్తరిస్తామని తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేరే వరకు ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)



# కాళేశ్వరంపై అబద్ధాల ప్రచారం



- శాస్త్రీయంగా పునరుద్ధరణ చేస్తున్నాం
- బీఆర్ఎస్‌కు ఉత్తమ్ ఘాటు రిప్లై

### బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు

వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం మేడిగడ్డకు మార్చిందని ఉత్తమ్ ఆరోపించారు. కమిషన్ల కోసమే ప్రాజెక్టు మార్పు జరిగిందని విమర్శించారు. తుమ్మడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పడం పూర్తిగా అవాస్తవమని అన్నారు. ప్రాజెక్టుపై ఇప్పటికే 30 శాతం వ్యయం చేసిన తర్వాత మార్పులు చేయడం వల్లే సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కూలిపోవడానికి డిజైన్, నిర్మాణ లోపాలే కారణమని జాతీయ స్థాయి నిపుణులు నివేదిక ఇచ్చారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం లేదని, పూర్తిగా సాంకేతిక నివేదికల ఆధారంగానే ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

### ఐఐటీ బొంబాయి సాంకేతిక సహకారం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జరుగుతున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. పరీక్షల ఫలితాల ఆధారంగా పునరుద్ధరణకు అవసరమైన డిజైన్లను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్, నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రముఖ సంస్థలు నేల, పునాదులు, కాంక్రీట్ నిర్మాణాలపై విస్తృత పరిశీలనలు నిర్వహించాయని వివరించారు. పరీక్షల నివేదికలను ఐఐటీ బొంబాయికి పంపినట్లు మంత్రి తెలిపారు. అక్కడి నిపుణులు సమగ్ర పునరుద్ధరణ నమూనాలను రూపొందిస్తున్నారని చెప్పారు. అవసరమైతే డయాఫ్రం వాల్ పునర్నిర్మాణాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. తుది సాంకేతిక నివేదికలు వచ్చిన తర్వాతే మరమ్మతుల విధానంపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

### భద్రతకు తొలి ప్రాధాన్యం

కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ సూచనల మేరకే పునరుద్ధరణ పనులు చేపడతామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భద్రతపై పూర్తి స్థాయి అనుమతులు వచ్చిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. భారత సైన్యంలో పనిచేసిన అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సేవలను కూడా ప్రభుత్వం వినియోగిస్తోందని వెల్లడించారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ కీలక ప్రాజెక్టును శాశ్వత భద్రతతో పునరుద్ధరించి రాష్ట్ర అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌తో అన్ని వర్గాలకు మోసం

- బాన్సువాడలో పోచారానికి చెక్
- గులాబీ జెండా ఎగరాలన్న కేటీఆర్!

### పోచారంపై ఘాటు విమర్శలు

బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి రాజకీయంగా తప్పు నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ విమర్శించారు. ఒకప్పుడు పార్టీ మారబోనని చెప్పిన నాయకుడు చివరకు మాట తప్పారని ఆరోపించారు. ప్రస్తుతం ఆయన ఏ పార్టీలో ఉన్నారో కూడా ప్రజలకు స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. తన రాజకీయ భవిష్యత్తును తానే దెబ్బతీశారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి సభలో కేసీఆర్‌ను విమర్శించడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై మాత్రం స్పష్టత కనిపించడం లేదని అన్నారు.

### కాళేశ్వరంపై ప్రభుత్వాన్ని వదిలిపెట్టం

కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ పిల్లర్లు కుంగి 31 నెలలు గడిచినా ఇప్పటి వరకు పూర్తి స్థాయి మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని కేటీఆర్ ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి నీరు కిందకు వెళ్తున్నా పంపింగ్ చేయడం లేదని ఆరోపించారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఈ అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. రాష్ట్రంలో రైతులు ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని చెప్పారు. యాప్‌లో నిల్వలు కనిపించినా రైతులకు సంచులు అందడం లేదని ఆరోపించారు. ఢిల్లీకి పంపేందుకు ఎరువులు సిద్ధంగా ఉంటే, రైతులకు మాత్రం అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.



### తెలంగాణ కోసం పోరాటం కొనసాగిస్తాం

తెలంగాణ ప్రయోజనాల కోసం అవసరమైతే ప్రాణాలైనా అర్పించేందుకు బీఆర్ఎస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కల్పించిన ఉద్యోగాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తమ విజయంగా ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాన్సువాడలో గులాబీ జెండా మళ్లీ ఎగరే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని తిరిగి సాధించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ఊహాగానాలకు చెక్



పార్టీ మారుతున్నానంటూ జరుగుతున్న ప్రచారానికి మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తెరదించారు. తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరే ఆలోచన లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని తేల్చిచెప్పారు. సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో వస్తున్న వార్తలను నమ్మవద్దని పార్టీ శ్రేణులకు సూచించారు.

### బీఆర్ఎస్‌పైనే విశ్వాసం

బీఆర్ఎస్ నాయకత్వంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని మల్లారెడ్డి తెలిపారు. గతంలో పార్టీ కోసం ఎలా పనిచేశానో, భవిష్యత్తులో కూడా అదే నిబద్ధతతో పనిచేస్తానన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని వెల్లడించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టం చేశారు.

### ప్రచారానికి కారణమైన పరిణామాలు

ఇటీవల ఘట్‌కేసర్‌లో జరిగిన అందెశ్రీ స్మృతి వనం భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అదే కార్యక్రమానికి మల్లారెడ్డి కూడా ప్రజాప్రతినిధిగా హాజరయ్యారు. మరోవైపు అదే సమయంలో జరిగిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు ఆయన గైర్హాజరయ్యారు. దీంతో ఆయన పార్టీ మారే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.

### మౌనంతో పెరిగిన చర్చలు

ఆ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై విమర్శలు చేసినప్పటికీ మల్లారెడ్డి స్పందించకపోవడం కూడా చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఆయన బీజేపీలో చేరుతారనే ప్రచారం వేగంగా సాగింది. అంతకుముందు కాంగ్రెస్‌లో చేరేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయనే వార్తలు వినిపించాయి. అయితే ఈ ప్రచారాలన్నింటినీ మల్లారెడ్డి తాజాగా పూర్తిగా ఖండించారు.

# ఎంత అన్యాయం..

- సర్‌తో బీజేపీ ఓట్లే ఎత్తేస్తారా?
- సీఈవోకు బీజేపీ ఫిర్యాదు
- ఓటర్ల నమోదులో అక్రమాలు?
- కేంద్ర బలగాలు కావాలన్న నేతలు

### కాంగ్రెస్, ఎంఐఎంపై ఆరోపణలు

ఓటర్ల నమోదు ప్రక్రియలో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు వలస ఓటర్లను బెదిరిస్తున్నాయని బీజేపీ ఆరోపించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ఓటరు గుర్తింపు కార్డు ఉండాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. అలాంటి ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించింది. ఈ ఆరోపణలను ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది.

### కేంద్ర బలగాల మోహరింపు డిమాండ్

రాజ్యాంగం ప్రకారం దేశంలో ఎక్కడైనా ఓటు నమోదు చేసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని బీజేపీ గుర్తు చేసింది. ప్రభుత్వ పథకాలకు ఓటరు గుర్తింపు కార్డుతో ఎలాంటి సంబంధం లేదని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఇప్పటికే స్పష్టం చేశారని పేర్కొంది. అందువల్ల ఐటీ ఉద్యోగులు, వలస కార్మికులు, ఇతర ఓటర్లు అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సున్నితమైన ప్రాంతాల్లో స్వేచ్ఛాయుతంగా ఓటర్ల నమోదు ప్రక్రియ సాగాలంటే కేంద్ర బలగాలను మోహరించాలని బీజేపీ డిమాండ్ చేసింది. స్థానిక అధికారుల స్థానంలో ఇతర రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులను రోల్ అబ్జర్వర్లుగా నియమించాలని కోరింది. దీంతో ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడింది.

### పాతబస్తీపై ప్రత్యేక దృష్టి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ముఖ్యంగా పాతబస్తీలో ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని రామచందర్‌రావు సీఈవోకు సూచించారు. అక్కడ అనుభవజ్ఞులైన అధికారులను నియమించాలని కోరారు. క్షేత్రస్థాయిలో కొంతమంది సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ అనుకూల ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అదే సమయంలో అనర్హులను ఓటరు జాబితాలో చేర్చుతున్నారని కూడా ఆరోపించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో కీలకంగా పనిచేస్తున్న బూత్ లెవల్ అధికారులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి తగిన ప్రోత్సాహం ఉంటే ఎన్నికల ప్రక్రియ మరింత సమర్థంగా సాగుతుందని పేర్కొంది. పారదర్శకత, నిష్పాక్షికతతో ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని బీజేపీ విజ్ఞప్తి చేసింది.





# కొత్త ఇందిరమ్మ ఇళ్ల నుంచే..

- వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తాం
- 16 నియోజకవర్గాల్లో తొలి దశ
- ఒక్కో నియోజకవర్గంలో 500
- సిటీలో 8 వేల ఇళ్ల నిర్మాణాలు
- వివరాలు వెల్లడించిన పొంగులేటి

### జులై 21 నుంచి దరఖాస్తులు

ఇందిరమ్మ ఇళ్ల కోసం జులై 21 నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి వెల్లడించారు. మీ సేవా కేంద్రాలు, వాట్సాప్ నంబర్ 8096958096, అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తామని చెప్పారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలని, క్యూర్ పరిధిలో ఇప్పటికే ఇల్లు లేదా స్థలం ఉండకూడదని అర్హత నిబంధనలను వివరించారు.

### ఒక్కో ఇంటికి రూ.11 లక్షల విలువ

ప్రతి ఇంటి నిర్మాణానికి సుమారు రూ.11 లక్షలు వ్యయం అవుతుందని మంత్రి తెలిపారు. ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షలు సబ్సిడీగా అందిస్తుందని చెప్పారు. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారులు నాలుగు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించారు. దరఖాస్తు సమయంలో చెల్లించే రూ.10 వేల మొత్తాన్ని చివరి చెల్లింపులో మినహాయిస్తామని వెల్లడించారు. ఇల్లు మంజూరు కాకపోతే ఆ డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

### ఉచిత స్థలం.. మహిళ పేరుతో రిజిస్ట్రేషన్

పేదలకు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో కూడిన ఫ్లాట్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో ఇంటికి అనుబంధంగా రూ.40 నుంచి రూ.60 లక్షల విలువ చేసే స్థలాన్ని మహిళ పేరుతో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని వెల్లడించారు. ఆస్తిని పదేళ్ల వరకు విక్రయించేందుకు అనుమతి ఉండదని, అయితే బ్యాంకు రుణం కోసం తనఖా పెట్టుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

### లాటరీ ద్వారా ఎంపిక

దరఖాస్తులను 360 డిగ్రీల విధానంలో పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామని మంత్రి తెలిపారు. అర్హుల సంఖ్య ఎక్కువైతే అందరి సమక్షంలో బహిరంగ లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి స్థలాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

### వచ్చే బోనాలకు కొత్త ఇళ్లే లక్ష్యం

ప్రస్తుతం జరుగుతున్న బోనాల పండుగను పురస్కరించుకుని ఈ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి పొంగులేటి తెలిపారు. వచ్చే ఏడాది బోనాల నాటికి క్యూర్ పరిధిలో నిర్మించే కొత్త ఇందిరమ్మ ఇళ్ల నుంచే బోనాలు ఎత్తేలా పనులను వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా పేదల సంక్షేమంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. త్వరలో మధ్యతరగతి కుటుంబాల కోసం కూడా గృహాల విషయంలో ప్రత్యేక శుభవార్త ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ పథకం ద్వారా హైదరాబాద్‌లో వేలాది పేద కుటుంబాలకు శాశ్వత గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

# నిన్న అలా.. నేడు ఇలా

- లైంగిక ఆరోపణల కేసులో ట్విస్ట్
- ఆత్మహత్యాయత్నంతో కలకలం!
- ట్రైనీ ఐపీఎస్‌పై సస్పెన్షన్
- పోలీస్ అకాడమీలో సంచలనం

హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించిన వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదు నేపథ్యంలో అకాడమీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రివిలేజ్ కమిటీ సిఫారసు మేరకు ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. ఇదే సమయంలో ఆయన ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చిన ఫిర్యాదును అకాడమీ అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన తర్వాత ప్రివిలేజ్ కమిటీ తన నివేదికను సిద్ధం చేసింది. ఆ నివేదిక ఆధారంగా ఉదయ్ కృష్ణారెడ్డిపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. సర్వీసులో తుది నిర్ణయం కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ పరిధిలో ఉంటుందని అధికారులు తెలిపారు.

### పోలీసు కేసు నమోదు

మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి తనను లైంగికంగా వేధిస్తున్నారని, అసభ్యకర సందేశాలు పంపుతున్నారని, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారని ఆమె ఆరోపించారు. అలాగే బెదిరింపులకు పాల్పడ్డారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ట్రైనీ అధికారికి నోటీసులు కూడా జారీ చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన సాక్ష్యాలను సేకరిస్తున్నారు. మరోవైపు అకాడమీ అంతర్గత కమిటీ కూడా తన విచారణను నిర్వహించింది. లభ్యమైన ఆధారాలను పరిశీలించిన అనంతరం పరిపాలనా చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కేసుకు సంబంధించిన అన్ని అంశాలను చట్టపరంగా పరిశీలిస్తున్నామని తెలిపారు.

### ఆత్మహత్యాయత్నం కలకలం

సస్పెన్షన్ నిర్ణయం వెలువడిన అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. వెంటనే ఆయనను ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఘటనకు ముందు తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ సామాజిక మాధ్యమంలో ఒక సందేశం పెట్టినట్లు సమాచారం. అయితే ఆ ఆరోపణలపై తుది నిజానిజాలు దర్యాప్తు పూర్తయ్యాకే స్పష్టమవుతాయి. ఈ ఘటన జాతీయ పోలీస్ అకాడమీలో తీవ్ర చర్చకు దారితీసింది. ఒకవైపు పోలీసు కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, మరోవైపు పరిపాలనా చర్యలు కూడా ప్రారంభమయ్యాయి. చట్టపరమైన విచారణ, శాఖాపరమైన ప్రక్రియ పూర్తైన తర్వాతే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఈ వ్యవహారంపై పోలీసు శాఖ, సంబంధిత అధికారులు తదుపరి చర్యలు ఎలా తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఆరోపణలు విచారణలో ఉన్నందున తుది నిర్ణయం వచ్చే వరకు చట్టపరమైన ప్రక్రియ కొనసాగనుంది.

# ట్రైనీ ఐపీఎస్ ఘటనలో ట్విస్ట్

- ఆత్మహత్య కాదు, మద్యం మత్తే కారణం!
- సూసైడ్ అంటూ మొదట ప్రచారం
- మందు ఫుల్లుగా కొట్టడం వల్లేనా?
- వైద్యుల నివేదికతో కొత్త మలుపు
- ఏది నిజం? ఏది అబద్ధం?

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఎం. ఉదయ్ కృష్ణారెడ్డి ఘటనలో కీలక మలుపు చోటుచేసుకుంది. తొలుత ఆయన ఆత్మహత్యకు యత్నించినట్లు ప్రచారం జరిగినప్పటికీ, చికిత్స అందిస్తున్న వైద్యులు ఆ కథనాన్ని ఖండించారు. ఆదివారం రాత్రి అధికంగా మద్యం సేవించడంతోనే ఆయన స్పృహ కోల్పోయారని వెల్లడించారు. రక్త పరీక్షల్లో ఎలాంటి విషపదార్థాలు గుర్తించలేదని స్పష్టం చేశారు.

### ఆస్పత్రి వైద్యుల వివరణ

ఎస్సార్ నగర్‌లోని జయంతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆయన శరీరంలో విషపదార్థాల ఆనవాళ్లు లేవని పరీక్షల్లో తేలిందన్నారు. దీంతో ఆత్మహత్యాయత్నం జరిగిందన్న ప్రారంభ సమాచారం తప్పని వైద్యుల ప్రకటనతో స్పష్టమైంది. ఉదయ్ కృష్ణారెడ్డి ఎర్రగడ్డలోని మోతీనగర్‌లో కుటుంబ స్నేహితుడి ఇంట్లో స్పృహ తప్పి పడిపోయినట్లు ఆయన సోదరుడు వెల్లడించారు. గదిలో మద్యం సీసాలతో పాటు శానిటైజర్ బాటిళ్లు కనిపించడంతో రెండింటినీ కలిపి తాగి ఉంటాడేమోనని తొలుత కుటుంబ సభ్యులు అనుమానించినట్లు చెప్పారు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించామని తెలిపారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని వెల్లడించారు.

### లైంగిక వేధింపుల కేసు నేపథ్యం

మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆదివారం ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూన్ 23 నుంచి వేధింపులకు పాల్పడ్డారని, అసభ్యకర సందేశాలు పంపారని, వ్యక్తిగతంగా అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును జాతీయ పోలీస్ అకాడమీ కూడా తీవ్రంగా పరిగణించింది. ఫిర్యాదు, సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన ప్రివిలేజెస్ కమిటీ విచారణ పూర్తయ్యే వరకు ఆయనను సస్పెండ్ చేసింది. స్పృహ కోల్పోయే ముందు ఉదయ్ కృష్ణారెడ్డి సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. వాస్తవాలను నిర్ధారించకుండా వార్తలు ప్రసారం చేయవద్దని మీడియాకు విజ్ఞప్తి చేశారు. చట్టంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని కూడా తన సందేశంలో పేర్కొన్నారు.



# బహదూర్‌గూడ భూములపై స్టే



- 28 ఎకరాలపై కీలక ఆదేశం
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

### రైతుల పిటిషన్‌తో విచారణ

సర్వే నంబర్లు 3, 4లోని 28 ఎకరాల భూమి తమదేనని పేర్కొంటూ నలుగురు రైతులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అత్యవసరంగా లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు వెంటనే విచారణ చేపట్టింది. దాదాపు 30 ఏళ్లుగా తాము ఆ భూమిలో వ్యవసాయం చేస్తున్నామని, తమ హక్కులను కాపాడాలని రైతుల తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ కోర్టులో వాదనలు వినిపించారు. రైతుల వద్ద ఉన్న పాస్‌బుక్స్‌పై సంబంధిత అధికారుల సంతకాలు లేవని తెలిపారు. కొన్నేళ్లుగా సాగు చేస్తున్న కారణంతో మాత్రమే ఆ భూమిపై హక్కు చెప్పలేరని వాదించారు. ఆ 28 ఎకరాలు ప్రభుత్వ భూమేనని స్పష్టం చేశారు. చట్టపరమైన రికార్డుల ప్రకారమే ప్రభుత్వం తన వాదనను వినిపించింది.

### భూముల వివాదానికి తాత్కాలిక విరామం

ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు, మధ్యంతర దశలో రైతుల వాదనను పరిగణనలోకి తీసుకుంది. దశాబ్దాలుగా సాగు చేస్తున్న విషయాన్ని పరిశీలిస్తూ, పూర్తి విచారణ పూర్తయ్యే వరకు వారి భూములపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. దీంతో రైతులకు తాత్కాలిక ఊరట లభించింది. ఈ భూముల యాజమాన్యంపై తుది నిర్ణయం ఇంకా వెలువడాల్సి ఉంది. తదుపరి విచారణలో భూమికి సంబంధించిన రికార్డులు, పాస్‌బుక్స్, ఇతర ఆధారాలను హైకోర్టు పరిశీలించే అవకాశం ఉంది. ఆ తర్వాతే యాజమాన్య హక్కులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.





# కాక్రోచ్‌ల ముట్టడి.. దద్దరిల్లిన ఢిల్లీ

## భారీగా తరలివచ్చిన యువత — సీజేపీ మార్చ్ అడ్డుకున్న పోలీసులు!

దేశ రాజధాని ఢిల్లీలో సీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ఉద్రిక్తంగా మారింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాల నిపుణులు జంతర్‌మంతర్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వరకు భారీ మార్చ్ చేపట్టాలని నిర్ణయించారు. ముందుగానే అనుమతి నిరాకరించిన ఢిల్లీ పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేసి అన్ని మార్గాలను దిగ్బంధించారు.

**బారికేడ్ల వద్ద ఉద్రిక్తత**

మార్చ్ ప్రారంభమైన వెంటనే నిరసనకారులు బారికేడ్ల వరకు చేరుకున్నారు. వాటిని దాటేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో తోపులాటలు జరిగాయి. లాఠీచార్జ్‌లో పలువురు గాయపడ్డారని నిరసనకారులు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు వెంటనే స్పందించలేదు. బారికేడ్లను దాటలేక చాలామంది రోడ్డుపైనే కూర్చొని జాతీయ జెండాలు ఊపుతూ నినాదాలు చేశారు. మరికొందరు చిన్న చిన్న బృందాలుగా విడిపోయి పార్లమెంట్ చేరుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయత్నించారు. భారీ వర్షం కురిసినా నిరసనకారులు వెనక్కి తగ్గలేదు. స్వచ్ఛంద కార్యకర్తలు నీలిరంగు టార్పాలిన్‌లు ఏర్పాటు చేసి వర్షం నుంచి రక్షణ కల్పించారు. ఆహారం, తాగునీరు పంపిణీ చేశారు. దేశభక్తి గీతాలు వినిపిస్తుండగా నిర్వాహకులు శాంతియుతంగా నిరసన కొనసాగించాలని పదేపదే పిలుపునిచ్చారు. పోలీసులు రెచ్చగొట్టినా స్పందించవద్దని సూచించారు.

**గాయాలతో వెనుదిరిగిన నిరసనకారులు**

బారికేడ్ల వద్ద జరిగిన ఘర్షణల తర్వాత పలువురు గాయాలతో జంతర్‌మంతర్‌కు తిరిగి వచ్చారు. కొందరికి తలకు గాయాలు కాగా, మరికొందరు నడవలేని పరిస్థితిలో కనిపించారు. స్వచ్ఛంద వైద్య బృందాలు అక్కడే చికిత్స అందించాయి. ఒక మహిళకు కాలు విరిగినట్లు అనుమానం వ్యక్తమైంది. గాయపడిన వారు లాఠీచార్జ్‌లోనే గాయాలయ్యాయని ఆరోపించారు.

**సాయంత్రం మళ్లీ ఉద్రిక్తత**

సాయంత్రం పోలీసులు జంతర్‌మంతర్ వద్దకు చేరుకుని ఇకపై అక్కడ ఉండేందుకు అనుమతి లేదని లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రకటించారు. అనంతరం నిరసనకారులను వెనక్కి నెట్టే ప్రయత్నం చేశారు. కొందరు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరికొందరు చేతులు కలుపుకుని అక్కడే కూర్చున్నారు. ఈ సమయంలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తలు వచ్చాయి. అయితే ఆ ప్రయత్నాన్ని నిరసనకారులు అడ్డుకున్నారని సీజేపీ తెలిపింది. మరోవైపు అలాంటి ఘటన ఏదీ జరగలేదని ఢిల్లీ పోలీసులు ఖండించారు.

**యువత ఆవేదనకు ప్రతీకగా ఉద్యమం**

నీట్ పేపర్ లీక్ ఆరోపణలతో ప్రారంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు విద్య, ఉపాధి, పారదర్శకత, జవాబుదారీతనం వంటి విస్తృత అంశాలపై యువత ఆవేదనకు ప్రతీకగా మారింది. జూన్‌లో చిన్న స్థాయిలో ప్రారంభమైన సీజేపీ ఉద్యమం ప్రస్తుతం దేశవ్యాప్తంగా విస్తరించింది. విద్యార్థులు, ఉద్యోగార్థులు, సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష నాయకుల మద్దతుతో ఈ ఉద్యమం మరింత బలపడుతోంది. ఢిల్లీలో జరిగిన తాజా నిరసన కేంద్ర ప్రభుత్వానికి కీలక రాజకీయ సవాల్‌గా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సీజేపీ ఉద్యమం ఎందుకు?

- వ్యంగ్యం నుంచి ప్రజా ఉద్యమం
- ఢిల్లీ వీధుల్లో వేలాదిగా యువత



దేశ రాజధాని ఢిల్లీలో వేలాది మంది యువత వీధుల్లోకి రావడంతో రాజకీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు కొనసాగుతున్నాయి. కొద్ది నెలల క్రితం సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్య ఉద్యమంగా ప్రారంభమైన ఈ వేదిక ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద యువజన ఉద్యమాల్లో ఒకటిగా మారింది. జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు నిరసనలు విస్తరించాయి.

**వ్యంగ్యంతో మొదలైన ఉద్యమం**

సీజేపీ అంటే "కాక్రోచ్ జనతా పార్టీ". ఈ ఉద్యమాన్ని 30 ఏళ్ల రాజకీయ వ్యూహకర్త అభిజీత్ దిప్కే ప్రారంభించారు. తొలుత సరదాగా ఈ పేరుతో ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. గూగుల్ ఫారమ్ ద్వారా సభ్యత్వం నమోదు చేయగా వేలాది మంది యువత స్పందించారు. అదే ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించేలా చేసింది. సామాజిక మాధ్యమాల్లో ప్రారంభమైన ప్రచారం చివరకు వీధి నిరసనలుగా మారింది.

**'కాక్రోచ్' పేరు ఎలా వచ్చింది?**

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యల తర్వాతే "కాక్రోచ్ జనతా పార్టీ" అనే పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. నిరుద్యోగ యువత గురించి చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. ఆ వ్యాఖ్యలను వ్యంగ్యంగా మార్చి ఉద్యమకారులు ఈ పేరును స్వీకరించారు. బీజేపీ పేరును పోలి ఉండేలా "కాక్రోచ్ జనతా పార్టీ" అనే పేరుతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. నిరసనల్లో కొందరు యువకులు కాక్‌రోచ్ వేషధారణలో కూడా పాల్గొంటున్నారు.

**ఉద్యమానికి అసలు కారణం ఇదే**

దేశ వైద్య విద్య ప్రవేశ పరీక్ష అయిన నీట్‌లో వరుసగా పేపర్ లీక్ ఆరోపణలు రావడం ఈ ఉద్యమానికి ప్రధాన కారణమైంది. లక్షలాది మంది విద్యార్థులు నెలల తరబడి కష్టపడి పరీక్ష రాసిన తర్వాత పరీక్షను రద్దు చేయడం తీవ్ర అసంతృప్తికి దారితీసింది. భద్రత మధ్య మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. పరీక్ష రద్దుతో తీవ్ర మనోవేదనకు గురై కొందరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ పరిణామాల తర్వాత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది.

**వాంగ్‌చుక్ దీక్షతో ఉద్యమం ఉధృతం**

పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ సీజేపీకి మద్దతుగా జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. 20 రోజుల పాటు దీక్ష కొనసాగించిన తర్వాత ఆయనను పోలీసులు బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఉద్యమం మరింత ఉధృతమైంది. వెంటనే అభిజీత్ దిప్కే పార్లమెంట్ వైపు భారీ మార్చ్‌కు పిలుపునిచ్చారు. వేలాది మంది యువత స్పందించడంతో ఢిల్లీలో భారీ నిరసనలు జరిగాయి.

**ప్రభుత్వానికి పెరుగుతున్న సవాల్**

సీజేపీ ప్రధాన డిమాండ్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, పేపర్ లీకులపై కఠిన చర్యలు. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా బాధ్యత వహించాలని ఉద్యమ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ వంటి ప్రతిపక్ష నాయకులు కూడా విద్యార్థులకు మద్దతు ప్రకటించారు. ఢిల్లీలో జరిగిన ఈ భారీ ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి ఇటీవలి కాలంలో ఎదురైన అతిపెద్ద యువజన నిరసనగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఉద్యమం దేశ రాజకీయాల్లో కీలక చర్చగా మారింది.



## సీజేపీతో కేంద్రం చర్చలు

- దీక్ష విరమించాలంటూ విజ్ఞప్తి!
- నడ్డా నివాసంలో కీలక సమావేశం

నీట్-యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కొనసాగుతున్న సీజేపీ ఆందోళనల మధ్య కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చింది. కేంద్ర మంత్రి జేపీ నడ్డా నివాసంలో సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాతో కీలక సమావేశం జరిగింది. ఈ భేటీ సానుకూల వాతావరణంలో జరిగినట్లు నడ్డా వెల్లడించారు. చర్చల అనంతరం ఆందోళన విరమించి సాధారణ పరిస్థితులు పునరుద్ధరించేందుకు సహకరించాలని నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు.

**డిమాండ్లపై సీజేపీ స్పష్టత**

నిరసనకారుల నుంచే చర్చల ప్రతిపాదన వచ్చిందని జేపీ నడ్డా తెలిపారు. ఉదయం 11.50 గంటల నుంచి ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు కొనసాగాయని చెప్పారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో సీజేపీ ప్రతినిధులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారని వెల్లడించారు. ఆ అంశాలపై తగిన స్థాయిలో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశం తర్వాత సౌరవ్ దాస్ కూడా స్పందించారు. తాము పదినిమిషాల పాటు కేంద్ర మంత్రితో సమావేశమైనట్లు తెలిపారు. తమ డిమాండ్లను లిఖితపూర్వకంగా అందించామని చెప్పారు. ప్రభుత్వం అంతర్గతంగా ఈ అంశాలను పరిశీలిస్తామని చెప్పిందని వెల్లడించారు. ఇప్పటివరకు ఎలాంటి హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు.

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్**

నీట్-2026 పేపర్ లీక్, సీబీఎస్‌ఈ 12వ తరగతి పోర్టల్ సమస్యలు, సీయూఈటీ పరీక్షల ఆలస్యం వంటి ఘటనలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నేరుగా బాధ్యత వహించాలని సీజేపీ ఆరోపించింది. వరుస వైఫల్యాలు జరిగినా వ్యవస్థలో ఎలాంటి మార్పులు తీసుకురాలేదని విమర్శించింది. అందుకే ఆయన రాజీనామా చేయాలని తమ ప్రధాన డిమాండ్‌గా పేర్కొంది. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద వేలాది మంది నిరసనకారులు ఆందోళన కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. నగరంలో ఇప్పటికే నిషేధాజ్ఞలు అమల్లో ఉండటంతో పెద్ద ఎత్తున గుమికూడకుండా చర్యలు తీసుకున్నారు. కొందరు ప్రచారం చేస్తున్నట్లుగా బలవంతంగా ఖాళీ చేయించలేదని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

## విద్యార్థులపై టియర్‌గ్యాస్ ఎందుకు?

**నిరసన హక్కు గౌరవించాలన్న రాహుల్**

ఢిల్లీలో విద్యార్థులపై టియర్‌గ్యాస్ ప్రయోగించడం, లాఠీచార్జ్ చేయడాన్ని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను నేరస్తుల్లా చూడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఇలాంటి చర్యలు భారతదేశ సంప్రదాయం కాదని, ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు.

**పార్లమెంట్ మార్చ్‌లో ఉద్రిక్తత**

నీట్ సహా ప్రధాన పరీక్షల్లో పేపర్ లీకులు, సాంకేతిక లోపాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టారు. వారిని ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించారు. అనంతరం లాఠీచార్జ్ కూడా చేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది.

**నేరస్తులు కాదు.. హక్కులు అడుగుతున్నారు**

విద్యార్థుల నిరసనపై స్పందించిన రాహుల్ గాంధీ



వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఢిల్లీ వీధుల్లో నడుస్తున్న యువత నేరస్తులు కాదని స్పష్టం చేశారు. గౌరవప్రదమైన విద్యా వ్యవస్థ, పారదర్శక పరీక్షలు, సమర్థవంతమైన విద్యా విధానం కోరడం వారి రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. దేశంలో అత్యధిక జనాభా యువతేనని గుర్తుచేస్తూ, వారి గొంతును అణచివేయకుండా వినాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం దేశ విద్యా వ్యవస్థపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని రాహుల్ గాంధీ అన్నారు. వరుస పేపర్ లీకులు, పరీక్షల్లో అవకతవకలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. విద్యా సంస్థల నిర్వహణపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. యువత ఆవేదన సహజమని, దాన్ని అణచివేయడం సమస్యకు పరిష్కారం కాదని వ్యాఖ్యానించారు.

## ఢిల్లీలో ఇప్పుడేం జరుగుతోంది?



- కొనసాగుతోన్న సీజేపీ ఉద్యమం
- లాఠీచార్జ్ తర్వాత ఉద్రిక్తత
- మార్చ్‌కు పోలీసుల అడ్డుకట్ట

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ చేపట్టిన "సంసద్ చలో" మార్చ్ ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు వెళ్లాలని ప్రయత్నించిన వేలాది మంది నిరసనకారులను ఢిల్లీ పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.

**టియర్‌గ్యాస్.. లాఠీచార్జ్**

నిరసనకారులు బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడంతో పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించారు. అనంతరం లాఠీచార్జ్ కూడా చేశారు. ఈ ఘటనలో పలువురు గాయపడగా, మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జంతర్‌మంతర్ పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా పార్లమెంట్ వైపు వెళ్లే మార్గాలను పూర్తిగా మూసివేశారు.

**వేదిక తొలగించిన అధికారులు**

మార్చ్ అనంతరం జంతర్‌మంతర్ వద్ద ఏర్పాటు చేసిన సీజేపీ వేదికను అధికారులు తొలగించారు. అయినప్పటికీ అక్కడి నుంచి వెళ్లబోమని నిరసనకారులు స్పష్టం చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. వర్షంలోనూ వేలాది మంది అక్కడే ఉండి నిరసన కొనసాగించడం గమనార్హం. జంతర్‌మంతర్ పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు కొనసాగిస్తున్నారు. నిరసనకారులు అక్కడే ఉండాలని నిర్ణయించుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. నీట్ పేపర్ లీక్ వ్యవహారం, విద్యా వ్యవస్థలో సంస్కరణలు, వాంగ్‌చుక్ దీక్ష, సీజేపీ ఉద్యమం కలిసి దేశ రాజకీయాల్లో కీలక అంశాలుగా మారాయి. రానున్న రోజుల్లో ఈ ఉద్యమం మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## దీక్ష ఆపేదే లేదు

- వాంగ్‌చుక్ స్పష్టమైన హెచ్చరిక
- యువతకు మద్దతు కొనసాగిస్తా
- 23వ రోజుకు చేరుకున్న నిరాహార దీక్ష

పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన, విద్యార్థి నాయకులకు పార్లమెంట్ సభ్యులను కలిసే అవకాశం కల్పించే వరకు లేదా ఎంపీలు తనను ఆస్పత్రిలో కలిసి వారి సమస్యలు వినే వరకు దీక్ష విరమించబోనని ప్రకటించారు. ఈ మేరకు ఆయన స్వహస్తాలతో రాసిన లేఖను భార్య గీతాంజలి ఆంగ్మో సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు.

**విద్యా మంత్రిపై చర్య కోరిన వాంగ్‌చుక్**

శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువతపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై వాంగ్‌చుక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను బలవంతంగా అడ్డుకోవడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. అందుకే 23వ రోజు కూడా తన దీక్షను కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. యువతకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. నీట్-యూజీ పేపర్ లీక్ వ్యవహారంలో బాధ్యతను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వహించాలని వాంగ్‌చుక్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం జవాబుదారీతనం నిరూపించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పార్లమెంట్ ముందు ఉంచే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

**హైకోర్టులో ఆరోగ్యంపై విచారణ**

వాంగ్‌చుక్ సందేశం వెలువడే కొద్దిసేపటి ముందు కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధులు సమావేశమయ్యారు. సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా ప్రభుత్వానికి పలు డిమాండ్లు సమర్పించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పూర్తి స్థాయి బాధ్యత నిర్ధారించాలని కోరారు. విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి మరో ఆస్పత్రికి తరలించాలంటూ భార్య దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి, ఎయిమ్స్, ప్రైవేట్ ప్రయోగశాలల వైద్య నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. కేవలం ల్యాబ్ నివేదికలతో రోగి ఆరోగ్యాన్ని అంచనా వేయలేమని, క్లినికల్ పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

# రాయుడుపాలెంలో నయారా ఫ్యూయల్ స్టేషన్ ప్రారంభం

కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెంలో శ్రీ సురంపూడి ఆయిల్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నయారా ఎనర్జీ నూతన ఫ్యూయల్ స్టేషన్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఫ్యూయల్ స్టేషన్‌ను ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వ్యాపారవేత్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# మూడు కాదు.. ఒక్కటి గెలవండి

• బీజేపీ నేతలకు రాజాసింగ్ సవాల్

గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు కార్పొరేషన్లు గెలుస్తామని బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎద్దేవా చేశారు. మూడు కాదు.. ముందుగా ఒక్క కార్పొరేషన్‌లోనైనా గెలిచి చూపాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బండి సంజయ్, ఈటల రాజేందర్ కలిసి పనిచేస్తేనే పార్టీ అధికారంలోకి వస్తుందా అని ప్రశ్నించిన రాజాసింగ్, సీనియర్ నేతలు, కార్యకర్తల పరిస్థితిని కూడా ప్రస్తావించారు. రాంచందర్‌రావుకు పూర్తి స్వేచ్ఛ లేకుండా బాధ్యతలు అప్పగించారని ఆరోపించారు. నేతల మధ్య సయోధ్య, స్పష్టమైన వ్యూహం లేకపోవడం వల్లే పార్టీ బలహీనపడుతోందని వ్యాఖ్యానించారు.



# నీట్ దుమారం

•స్తంభించిన లోక్‌సభ • మొదటి రోజే గందరగోళం

•ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు




పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజే లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. నీట్ పేపర్ లీక్ ఆరోపణలు, అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం అంశాలను ప్రతిపక్ష పార్టీలు బలంగా ప్రస్తావించాయి. నినాదాలతో సభను హోరెత్తించడంతో సాధారణ కార్యక్రమాలు ముందుకు సాగలేదు. ఉదయం సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే వాతావరణం ఉద్రిక్తంగా మారింది.

**• ఆరు సార్లు వాయిదా**


ప్రతిపక్ష సభ్యుల నిరసనలతో సభను స్పీకర్ ఓం బిర్లా వరుసగా ఆరు సార్లు వాయిదా వేశారు. చివరకు మధ్యాహ్నం 3 గంటలకు రోజంతా సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. గందరగోళం కారణంగా ప్రభుత్వ వ్యాపారంలో దాదాపు ఏ అంశంపైనా చర్చ జరగలేదు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కు పెంచే ఆర్డినెన్స్‌కు బదులుగా బిల్లును మాత్రమే సభలో ప్రవేశపెట్టగలిగారు.

# వాంగ్‌చుక్ ఆరోగ్యంపై హైకోర్టు ఆందోళన!

**ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం, నేడు విచారణ**

వాతావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ ఆస్పత్రి మార్పిడి అంశంపై ఢిల్లీ హైకోర్టు నేడు కీలక విచారణ చేపట్టనుంది. వాంగ్‌చుక్‌ను ప్రభుత్వ ఆధ్వర్యంలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి నుంచి కుటుంబం కోరుకున్న మరో ఆస్పత్రికి తరలించాలని ఆయన భార్య గీతాంజలి జె. ఆంగ్మో దాఖలు చేసిన అప్పీల్‌ను కోర్టు విచారించనుంది. ప్రస్తుతం 22 రోజులుగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్న వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. (వివరాలు 7లో..)






# ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోండి

## కేంద్ర మంత్రులకు సీఎం లేఖలు

**ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్, పొగాకు రంగాలకు విధానపరమైన, ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో తీవ్రమవుతున్న పోటీ కారణంగా రైతులు, ఎగుమతిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు వేర్వేరుగా లేఖలు రాశారు.**

# రిజిస్ట్రేషన్ సేవలపై సీఎం క్లారిటీ

## ప్రైవేటీకరణ కాదన్న చంద్రబాబు

రిజిస్ట్రేషన్ సర్వీస్ కేంద్రాల (ఆర్ఎస్‌కే) ఏర్పాటుపై వస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమాధానం ఇచ్చారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ప్రజలకు వేగవంతమైన, సులభమైన సేవలు అందించడమే ఆర్ఎస్‌కేల లక్ష్యమని తెలిపారు. సచివాలయంలో జరిగిన రియల్ టైమ్ గవర్నెన్స్ సమీక్ష సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు.

**పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో సేవలు**

ఆర్ఎస్‌కేలు పూర్తిగా పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల నమూనాలో పనిచేస్తాయని చంద్రబాబు చెప్పారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, ప్రజల సమయాన్ని ఆదా చేయడం, సేవలను మరింత అందుబాటులోకి (వివరాలు 5లో..)



# సుప్రీం కోర్టులో జడ్జిల సంఖ్య పెంపు

▪ 38 మందికి పెంచే ప్రతిపాదన

▪ పెంపుపై కేంద్రం అడుగు

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్యను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును తీసుకొచ్చింది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం జడ్జిల సంఖ్యను 38కు పెంచేలా ప్రతిపాదించింది. పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని ప్రభుత్వం తెలిపింది. (వివరాలు 7లో..)



# ఒడెసా పోర్టు వద్ద ఘోరం

• ఓడపై ఉక్రెయిన్ క్షిపణి దాడి

• నలుగురు భారతీయులు మృతి

ఉక్రెయిన్‌లోని ఒడెసా పోర్టు సమీపంలో జరిగిన క్షిపణి దాడిలో నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మరో భారతీయుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూలై 19 సాయంత్రం పోర్టు నుంచి బయలుదేరుతున్న సమయంలో ఎంవీ గోల్డెన్ లియో అనే వాణిజ్య నౌకపై ఈ దాడి జరిగినట్లు తెలిపింది. ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. (వివరాలు 7లో..)

# ‘మన ఇల్లు-మన లోకేశ్’

»మంగళగిరిలో 3 వేల పట్టాలు

»రెండో విడతకు ఏర్పాట్లు పూర్తి

మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 21, 22 తేదీల్లో ‘మన ఇల్లు - మన లోకేశ్’ కార్యక్రమం కింద సుమారు 3 వేల మందికి పట్టాలు, ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు మంత్రి నారా లోకేశ్ అందజేయనున్నారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాలు, అటవీ భూములు, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్నాయి. అయితే ఆయా స్థలాలపై వారికి అధికారిక హక్కులు లేకపోవడంతో వారసత్వ బదిలీలు, రుణాల పొందిక, ఆస్తి లావాదేవీలు సాధ్యం కాలేదు. ఎన్నికల సమయంలో ఈ సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు. (వివరాలు 5లో..)








# ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం

## ప్రధాని మోదీ చేతుల మీదుగా కార్యక్రమం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. నిర్మాణ పనులు పూర్తికావడంతో ప్రారంభోత్సవానికి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ విమానాశ్రయాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. భద్రత, పార్కింగ్, ప్రజల రాకపోకలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. (వివరాలు 5లో..)



# మళ్లీ మారాడు

▪ బ్రిటన్‌లో కొత్త ప్రధాని

▪ బాధ్యతలు చేపట్టిన బర్న్‌హామ్

▪ పదేళ్లలో ఏడో ప్రధానిగా పగ్గాలు

బ్రిటన్ కొత్త ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్ బాధ్యతలు స్వీకరించారు. గత పదేళ్లలో దేశానికి ఏడో ప్రధానమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారు. మాజీ మాంచెస్టర్ మేయర్‌గా గుర్తింపు పొందిన బర్న్‌హామ్‌ను కింగ్ చార్ల్స్-III అధికారికంగా ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే దేశ రాజకీయ వ్యవస్థలో పెద్ద మార్పులు తీసుకొస్తానని ప్రకటించారు. అధికారాన్ని లండన్‌కే పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విస్తరిస్తానని స్పష్టం చేశారు. (వివరాలు 7లో..)

# కాలువలపై విమర్శల దుమారం

» హంద్రీనీవాపై వైసీపీ రాజకీయం

» ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు

హంద్రీనీవా ప్రాజెక్టుపై వైఎస్సార్‌సీపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆరోపించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలోని చెరువులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాలువలపై మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలకు సూచించారు. (వివరాలు 5లో..)



# అనుమానాస్పదం

• త్రిపుర డీజీపీ మృతి • పోలీస్ శాఖలో విషాదం!

త్రిపుర... డీజీపీ అనురాగ్ ధంకర్ సోమవారం అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. అగర్తలలోని అఖౌరా రోడ్డులో ఉన్న పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం కార్యాలయానికి వచ్చిన ఆయన కొద్దిసేపటి తర్వాత తన ఛాంబర్‌కు ఆనుకుని ఉన్న వాష్‌రూమ్‌లోకి వెళ్లారు. చాలా సమయం గడిచినా బయటకు రాకపోవడంతో సిబ్బంది అనుమానించారు. చివరకు తలుపులు బలవంతంగా తెరిచి చూడగా ఆయన అపస్మారక స్థితిలో కనిపించినట్లు సమాచారం. (7లో..)





# బ్రిటన్‌లో అసలేం జరుగుతోంది

• ఎన్నికలు లేకుండానే కొత్త ప్రధాని!

• లేబర్ పార్టీలో నాయకత్వ మార్పు

బ్రిటన్‌లో సాధారణ ఎన్నికలు జరగకుండానే కొత్త ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. లేబర్ పార్టీ సీనియర్ నేత, మాజీ గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ ఆండీ బర్న్‌హామ్ సోమవారం అధికారికంగా బ్రిటన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అధికార పార్టీ నాయకుడిగా ఆయన ఎంపిక కావడంతో ప్రధానమంత్రి పదవి కూడా ఆయనకే దక్కింది. ఇదంతా బ్రిటన్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో అమలులో ఉన్న రాజ్యాంగ ప్రక్రియలో భాగమే. (వివరాలు 7లో..)

# ఏపీలో శాంతిభద్రతలు ఘోరం

• పార్లమెంట్‌లో ప్రస్తావించిన వైసీపీ

• ఎంపీ గురుమూర్తి వాయిదా తీర్మానం

ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి రోజురోజుకీ క్షీణిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. ఈ అంశం అత్యంత ప్రజా ప్రాధాన్యమైనదని భావిస్తూ లోక్‌సభలో తక్షణ చర్చ చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. (5లో..)



# ‘రెడ్‌బుక్ రాజ్యాంగం’తో పాలన

• ‘పచ్చబిళ్ల’తోనే వ్యవస్థ అంటూ విమర్శలు

• కూటమి పాలనపై పేర్ని నాని ఆరోపణలు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆరోపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, చట్టబద్ధ పాలనకు బదులుగా రాష్ట్రంలో “రెడ్‌బుక్ రాజ్యాంగం” అమలవుతోందని విమర్శించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లోనై పనిచేస్తోందని అన్నారు.




# మద్యం టెండర్ కేసులో ట్విస్ట్

» ముగ్గురికి జ్యుడీషియల్ రిమాండ్

» ఏసీబీ కోర్టు కీలక ఆదేశాలు

» హైదరాబాద్ జైలు నుంచి తరలింపు


సంచలనం సృష్టించిన మద్యం రవాణా టెండర్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులైన మాజీ అధికారి వాసుదేవ రెడ్డి, రాజ్ కేసిరెడ్డి, కరుమూరి సునీల్‌ను విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. వాదనలు విన్న కోర్టు ముగ్గురినీ ఆగస్టు 3 వరకు న్యాయస్థాన రిమాండ్‌కు పంపిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో ఇప్పటికే ఈ ముగ్గురు చంచల్‌గూడ కేంద్రకారాగారంలో అండర్‌ట్రయల్ ఖైదీలుగా ఉన్నారు. జైలు ట్రాన్సిట్ వారెంట్లపై వారిని వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత విజయవాడకు తీసుకొచ్చారు. అనంతరం ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. (వివరాలు 7లో..)



# ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోండి

- కేంద్ర మంత్రులకు సీఎం లేఖలు




ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్, పొగాకు రంగాలకు విధాన పరమైన, ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో తీవ్రమవుతున్న పోటీ కారణంగా రైతులు, ఎగుమతిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు వేర్వేరుగా లేఖలు రాశారు.

**ఆక్వా రైతులకు ప్రత్యేక సాయం కోరిన సీఎం**

ఆక్వాకల్చర్ రంగానికి ఉపయోగించే ఏరేటర్లపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని చంద్రబాబు కోరారు. ఆక్వా రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు పథకం కింద ఒకేసారి అదనంగా రూ.5 లక్షల రుణ పరిమితి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశీయ మార్కెటింగ్‌ను బలోపేతం చేసేందుకు నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో రూ.100 కోట్ల ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కూడా సూచించారు.

**పొగాకు రంగానికి ఊతం ఇవ్వాలన్న విజ్ఞప్తి**

తయారీ చేయని పొగాకుపై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జీఎస్‌టిని 28 శాతానికి తగ్గించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ నిర్ణయం వల్ల రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులకు ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత పొగాకు పోటీతత్వం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌కు రాసిన లేఖలో చేపల దాణా తయారీలో ఉపయోగించే ఫిష్ మీల్ ఎగుమతులను నియంత్రించాలని చంద్రబాబు కోరారు. అధిక ఎగుమతుల కారణంగా దేశీయంగా ధరలు పెరుగుతున్నాయని వివరించారు. ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు తయారీ చేయని పొగాకును ఆర్వోడీటీఈపీ ఎగుమతి చేసిన ఉత్పత్తులపై చెల్లించిన సుంకాలు, పన్నుల తిరిగి చెల్లింపు పథకం చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

**అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం**

రొయ్యల దాణాలో ప్రధాన ముడిసరుకైన జన్యుమార్పిడి సోయాబీన్ మీల్ దిగుమతులకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మత్స్యశాఖ మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. దేశీయంగా కొరత ఏర్పడటం వల్ల దాణా వ్యయం పెరుగుతోందని తెలిపారు. 2021లో ఇలాంటి దిగుమతులకు కేంద్రం అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈక్వెడార్ నుంచి రొయ్యల ఎగుమతులు పెరగడంతో అమెరికా, చైనా, యూరప్ మార్కెట్లలో పోటీ మరింత తీవ్రమైందని వివరించారు. అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని కూడా చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యాలయం కోసం గుంటూరు జిల్లా నెక్కల్లు గ్రామంలో 7.89 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. అదే ప్రాంతంలో మత్స్య శిక్షణ కేంద్రం, ఫిషరీస్ పార్క్, పబ్లిక్ అక్వేరియం ఏర్పాటుకు కూడా భూమి సిద్ధంగా ఉందని వెల్లడించారు. కేంద్రం సహకరిస్తే ఆక్వా రంగం, పొగాకు రంగం బలోపేతమై రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# రిజిస్ట్రేషన్ సేవలపై సీఎం క్లారిటీ

(మొదటి పేజీ తరువాయి..)

ప్రధాన ఉద్దేశమని వివరించారు. దీనిని ప్రైవేటీకరణగా ప్రచారం చేయడం వాస్తవాలకు విరుద్ధమని పేర్కొన్నారు. కొత్త వ్యవస్థ వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను అధికారులు విస్తృతంగా వివరించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ వ్యవస్థలో మార్పుల వల్ల దస్తావేజు రచయితలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

**ఫిర్యాదుల పరిష్కారంపై ఆదేశాలు**

దీపం 2.0 పథకం కింద లబ్ధిదారులకు సబ్సిడీలు నిర్ణయించిన తేదీల్లోనే జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ, ఆర్థిక శాఖ సమన్వయంతో ఈ ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రయోజనాలు చేరేలా చూడాలని చెప్పారు. ప్రజా ప్రయోజనం లేకుండా పదేపదే ఫిర్యాదులు చేసే వ్యక్తులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అలాంటి 81 మందిని గుర్తించినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. వారు సగటున 246 ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ఆర్థిక భారం లేని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఆర్థిక అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని చంద్రబాబు ఆదేశించారు.

**వర్షా భావం, పాలనపై దిశానిర్దేశం**

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 49 శాతం వర్షాభావం నమోదైనట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ వ్యూహాలు అమలు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు పొడి పంటల సాగుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ గ్రామీణ్ పనులను



జలధార నీటి సంరక్షణ కార్యక్రమాలతో అనుసంధానం చేయాలని సూచించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే ప్రజాభిప్రాయాన్ని విశ్లేషిస్తూ నివారణ చర్యలు తీసుకోవడమే సమర్థ పాలనకు మార్గమని చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు.

# మన ఇల్లు–మన లోకేశ్

- మంగళగిరిలో 3 వేల పట్టాలు
- రెండో విడతకు ఏర్పాట్లు పూర్తి



మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 21, 22 తేదీల్లో 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమం కింద సుమారు 3 వేల మందికి పట్టాలు, ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు మంత్రి నారా లోకేశ్ అందజేయనున్నారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాలు, అటవీ భూములు, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్నాయి. అయితే ఆయా స్థలాలపై వారికి అధికారిక హక్కులు లేకపోవడంతో వారసత్వ బదిలీలు, రుణాల పొందిక, ఆస్తి లావాదేవీలు సాధ్యం కాలేదు. ఎన్నికల సమయంలో ఈ సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు.

**మొదటి విడతలో 3,002 మందికి లబ్ధి**

2025 ఏప్రిల్‌లో జరిగిన తొలి విడతలో రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ ప్రాంతాల్లో నివసిస్తున్న 3,002 కుటుంబాలకు శాశ్వత పట్టాలు అందజేశారు. సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములపై అర్హులైన పేదలకు ఎలాంటి వ్యయం లేకుండా హక్కులు కల్పించారు. ఇప్పుడు రెండో విడతలో కూడా దాదాపు అదే స్థాయిలో లబ్ధిదారులకు పట్టాలు అందజేయనున్నారు. మంగళగిరి గ్రామంలోని సర్వే నంబర్లు 232/1B1A, 232/1B1B, 232/1B1Cతో పాటు నవులూరు గ్రామంలోని సర్వే నంబర్ 115లోని భూములు నిషేధిత ఆస్తుల జాబితాలో ఉండటంతో 1,622 ఇళ్ల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నిషేధాన్ని తొలగిస్తూ ఆర్డీవో ధృవీకరించిన ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లను మంత్రి లోకేశ్ లబ్ధిదారులకు అందజేయనున్నారు. దీంతో ఆస్తులపై చట్టబద్ధ హక్కులు లభించనున్నాయి.

**స్టీల్ బ్రిడ్జ్ బాధితులకు పునరావాసం**

అమరావతి రాజధాని ప్రాజెక్టులో భాగంగా బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం ప్రభావితమైన 81 కుటుంబాలకు కూడా పట్టాలు అందజేయనున్నారు. తాడేపల్లి మండలానికి చెందిన 47 కుటుంబాలు, మంగళగిరి మండలానికి చెందిన 34 కుటుంబాలకు ఆత్మకూరు లేఅవుట్‌లో పునరావాస ప్లాట్లు కేటాయించారు. లాటరీ విధానంలో ఈ ప్లాట్లను కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. జీఓ ఎంఎస్ నెం.30 ప్రకారం 150 చదరపు గజాల లోపు విస్తీర్ణం ఉన్న స్థలాలకు మొత్తం 906 క్రమబద్ధీకరణ పట్టాలను పంపిణీ చేయనున్నారు. వీటిలో తాడేపల్లి మండలానికి చెందిన 630 మంది, మంగళగిరి మండలానికి చెందిన 276 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వేలాది కుటుంబాలకు ఆస్తులపై శాశ్వత హక్కులు లభించనున్నాయి. భూములపై చట్టబద్ధ యాజమాన్యం ఏర్పడటంతో వారసత్వ బదిలీలు, రుణాల సౌకర్యం, భవిష్యత్ ఆస్తి లావాదేవీలు సులభంగా నిర్వహించే అవకాశం కలగనుంది.

# కాలువలపై విమర్శల దుమారం

- హంద్రీనీవాపై వైసీపీ రాజకీయం
- ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు

హంద్రీనీవా ప్రాజెక్టుపై వైఎస్సార్‌సీపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆరోపించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలోని చెరువులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాలువలపై మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలకు సూచించారు.

**నాసిరకం పనులు ఎక్కడ జరిగాయి?**

సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ అనేక చెరువులను నీటితో నింపిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని పరిటాల సునీత అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలువల నిర్వహణపై ఎలాంటి శ్రద్ధ చూపలేదని విమర్శించారు. గంప మట్టి కూడా తొలగించని వారు ఇప్పుడు హంద్రీనీవాపై మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. హంద్రీనీవా లైనింగ్ పనుల్లో నాసిరకం పనులు జరిగాయని ఆరోపిస్తే వాటిని నిరూపించాలని సునీత సవాల్ విసిరారు. ఎక్కడ పనుల్లో లోపాలు జరిగాయో, ఏ కాంట్రాక్టర్ చేశాడో వివరాలు ఇస్తే అదే సంస్థతో మరమ్మతులు చేయిస్తామని ప్రకటించారు. వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. క్షేత్రస్థాయిలో చెరువులు నిండిన పరిస్థితిని చూసి వైఎస్సార్‌సీపీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని పరిటాల సునీత సూచించారు.

# ఏపీలో శాంతిభద్రతలు ఘోరం

- పార్లమెంట్‌లో ప్రస్తావించిన వైసీపీ
- ఎంపీ గురుమూర్తి వాయిదా తీర్మానం



ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి రోజురోజుకీ క్షీణిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. ఈ అంశం అత్యంత ప్రజా ప్రాధాన్యమైనదని భావిస్తూ లోక్‌సభలో తక్షణ చర్చ చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ ఎం. గురుమూర్తి వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

**పోలీసుల తీరుపై ఆరోపణలు**

తన తీర్మానంలో ఎంపీ గురుమూర్తి పోలీసుల అధికార దుర్వినియోగంపై తీవ్ర ఆరోపణలు చేశారు. మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని, ఎస్సీలపై దాడులు కొనసాగుతున్నాయని, రాజకీయ హింస కారణంగా పౌర హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిణామాలు రాష్ట్ర పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయని వెల్లడించారు. విజయవాడలో సాయికృష్ణ లాకప్ డెత్, నెల్లూరు జిల్లా మనుబోలులో పోలీస్ కస్టడీలో ఏడుకొండలు మృతి, కర్నూలు జిల్లా అదోనిలో మాల గంగమ్మ ఘటన, విజయవాడలో క్రాంతికుమార్ మరణం, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఎస్కే దరియా హుస్సేన్ మృతి వంటి ఘటనలను ఎంపీ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇవన్నీ రాష్ట్ర పోలీసు వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అభిప్రాయపడ్డారు.

**నేరాల గణాంకాల వెల్లడి**

2024 జూన్ నుంచి 2025 మార్చి వరకు మహిళలపై నమోదైన 209 ఘటనలను ఎంపీ తన తీర్మానంలో పొందుపరిచారు. వీటిలో 126 అత్యాచారాలు, లైంగిక దాడులు, 12 అత్యాచార యత్నాలు, 35 లైంగిక వేధింపులు, 97 భౌతిక దాడులు, 34 హత్యలు లేదా అనుమానాస్పద మరణాలు, వేధింపుల కారణంగా 15 ఆత్మహత్యలు లేదా ఆత్మహత్యాయత్నాలు నమోదైనట్లు పేర్కొన్నారు. ఎస్సీలకు సంబంధించిన 69 ఘటనలు నమోదయ్యాయని ఎంపీ తెలిపారు. హత్యలు, కస్టడీ హింస, పోలీసుల వేధింపులు, సామాజిక బహిష్కరణ, భూ ఆక్రమణలు, ఇళ్ల కూల్చివేతలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కేసులు నమోదైనట్లు వివరించారు. రాజకీయ హింసకు సంబంధించిన 133 ఘటనల్లో 49 హత్యలు, 6 హత్యాయత్నాలు, 6 కిడ్నాప్‌లు, 58 భౌతిక దాడులు, 10 ఆస్తుల ధ్వంస ఘటనలు, 4 ఆత్మహత్యలు నమోదైనట్లు ఆరోపించారు.

**కేంద్ర జోక్యం కోరిన ఎంపీ**

రాష్ట్ర హైకోర్టు పోలీసుల పనితీరుపై 12 సందర్భాల్లో ప్రతికూల వ్యాఖ్యలు చేసిన విషయాన్ని కూడా గురుమూర్తి ప్రస్తావించారు. శాంతిభద్రతలకు సంబంధించిన 79 ప్రధాన ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర నివేదిక కోరాలని, అన్ని ఘటనలపై నిష్పక్షపాతంగా కాలపరిమితితో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉల్లంఘనలు నిర్ధారణైన చోట బాధ్యులపై చర్యలు తీసుకుంటూ రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించాలని, రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని లోక్‌సభ ద్వారా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

# 'రెడ్‌బుక్ రాజ్యాంగం'తో పాలన

- 'పచ్చబిళ్ల'తోనే వ్యవస్థ అంటూ విమర్శలు
- కూటమి పాలనపై పేర్ని నాని ఆరోపణలు



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆరోపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, చట్టబద్ధ పాలనకు బదులుగా రాష్ట్రంలో "రెడ్‌బుక్ రాజ్యాంగం" అమలవుతోందని విమర్శించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లోనై పనిచేస్తోందని అన్నారు.

**'పచ్చబిళ్ల'తోనే వ్యవస్థ నడుస్తోందని ఆరోపణ**

టీడీపీ నాయకుల ప్రభావంతోనే రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని పేర్ని నాని ఆరోపించారు. స్థానిక అధికార పార్టీ నేతల అనుమతి లేకుండా అనేక చోట్ల ఎఫ్ఐఆర్ కూడా నమోదు కావడం లేదని అన్నారు. భారత పార్లమెంట్ రూపొందించిన చట్టాల కంటే అధికార పార్టీ నాయకుల ఆదేశాలే అమలవుతున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. ప్రజలు న్యాయం కోసం తిరిగినా స్పందన లేదని, రాజకీయ ప్రభావం ఉంటేనే చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

**పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

గుంటూరు నగరంలోని నగరంపాలెంలో మహిళపై జరిగిన అమానుష ఘటన రాష్ట్రంలో మహిళల భద్రత ఎంత దారుణంగా ఉందో చూపిస్తోందని పేర్ని నాని అన్నారు. బాధితురాలు ముందుగానే పోలీసులను ఆశ్రయించినా స్పందన లేకపోయిందని ఆరోపించారు. అనంతరం జరిగిన దాడిలో మహిళను నడిరోడ్డుపై అవమానించారని చెప్పారు. ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత మాత్రమే పోలీసులు కదిలారని, స్థానిక ఎమ్మెల్యే జోక్యం తర్వాతే నిందితులు లొంగిపోయారని విమర్శించారు. ఈ ఘటనలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన గుంటూరు రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ, నగరంపాలెం సీఐపై వెంటనే సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించకపోవడం తీవ్రమైన వైఫల్యమని అన్నారు. పోలీస్ స్టేషన్ సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేసి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.

**సోషల్ మీడియా తర్వాత స్పందన**

ఘటన వీడియోలు బయటకు వచ్చిన తర్వాత మాత్రమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో స్పందించారని పేర్ని నాని అన్నారు. బాధ్యులపై ముందుగానే చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి ఇంత దూరం వెళ్లేదే కాదని విమర్శించారు. ప్రజల ఆవేదన కంటే రాజకీయ ప్రతిష్ఠకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. గుంటూరు ఘటనలో లంచాలు అడిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార పార్టీ స్థానిక నాయకులను ప్రధాన నిందితులుగా చేర్చి కఠిన చర్యలు తీసుకోవాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు నుంచి కేసు నమోదు వరకు జరిగిన ప్రతి అంశంపై స్వతంత్ర విచారణ జరపాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పిస్తూ చట్టాన్ని సమానంగా అమలు చేయడంలో ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరించాలని, శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం

**ప్రధాని మోదీ చేతుల మీదుగా కార్యక్రమం**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. నిర్మాణ పనులు పూర్తికావడంతో ప్రారంభోత్సవానికి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ విమానాశ్రయాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. భద్రత, పార్కింగ్, ప్రజల రాకపోకలపై అధికారులకు కీలక సూచనలు చేశారు.

**ఉత్తరాంధ్ర సంస్కృతికి ప్రతిబింబం**

ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా జానపద కళారూపాలతో స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు హోంమంత్రి అనిత తెలిపారు. ప్రారంభోత్సవం విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రతిపాదించింది. అప్పటి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు సహకారంతో ప్రాజెక్టుకు అనుమతులు లభించాయి. అనంతరం భూసేకరణ పూర్తయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టడంతో నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యాయి. రెండున్నరేళ్లలో విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది.

**ఏవియేషన్ హబ్‌గా భోగాపురం**

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా మారనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు మూడు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. పర్యాటకం, పారిశ్రామిక రంగం, రవాణా రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యాన పంటలు, సముద్ర ఉత్పత్తులు, ఔషధ ముడిసరకుల ఎగుమతులకు ఈ విమానాశ్రయం ప్రధాన కేంద్రంగా మారనుంది. విమానాశ్రయానికి అనుబంధంగా 136 ఎకరాల్లో జీఎంఆర్-మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేయనున్నారు. పైలట్లు, విమానయాన నిపుణులకు శిక్షణ ఇచ్చే కేంద్రాలు కూడా ఇక్కడ ఏర్పాటు కానున్నాయి. మరో 139 ఎకరాల్లో జీఎంఆర్ టౌన్‌షిప్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైంది. భవిష్యత్‌లో విమానయాన, పరిశ్రమలు, విద్య, ఆరోగ్య సేవలు, రవాణా రంగాలకు కేంద్రంగా భోగాపురం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టుతో ఉత్తరాంధ్ర దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో కీలక అభివృద్ధి కేంద్రంగా నిలిచే అవకాశం కనిపిస్తోంది.

# తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

**భూమి కబ్జాకు టీడీపీ నేతల యత్నమే కారణమంటున్న కుటుంబ సభ్యుల**



**చిన్నగంజాం, జులై 20 (నాదేశం):** భూవివాదం నేపథ్యంలో ఓ రైతు తహసీల్దార్ కార్యాలయం ముందే పురుగుల మందు తాగి బలవన్మరణానికి యత్నించిన ఘటన బాపట్ల జిల్లా చిన్నగంజాం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగంజాం మండలం రాజు బంగారుపాలెం గ్రామానికి చెందిన ఆట్ల వెంకటేశ్వరరెడ్డి అనే రైతుకు స్థానికంగా భూమి ఉంది. అయితే ఆ భూమికి సంబంధించి కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరెడ్డి సోమవారం చిన్నగంజాం మండల తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని, అందరూ చూస్తుండగానే పురుగుల మందు సేవించాడు. దీనిని గమనించిన స్థానికులు హుటాహుటిన రైతు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆయన్ను చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**రాజకీయ అండతోనే కబ్జా యత్నం..**

తమకు అన్ని రకాల చట్టబద్ధమైన హక్కులు కలిగిన పొలాన్ని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా లాక్కోవాలని చూస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న అధికార టీడీపీకి చెందిన మండల పార్టీ నేతల సహకారంతోనే తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతోనే వెంకటేశ్వరరెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# అప్పలరాజు కుటుంబానికి అండగా వైఎస్సార్సీపీ



మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పరామర్శించి ధైర్యం చెప్పారు. రోడ్డు ప్రమాద ఘటనలో అప్పలరాజు కుమారుడిపై హత్య కేసు నమోదు చేసి జైలుకు పంపడాన్ని వారు ఖండించారు. రాజకీయ కక్షతోనే ఈ కేసు నమోదు చేశారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులను అణచివేసేందుకు ప్రభుత్వం పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. తప్పుడు కేసులకు భయపడబోమని, న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో పార్టీ పూర్తిస్థాయిలో అప్పలరాజు కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# ముద్రగడ కుటుంబాన్ని పరామర్శించిన సజ్జల



మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులను వైఎస్సార్సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కిర్లంపూడిలో సోమవారం పరామర్శించారు. అనంతరం ముద్రగడ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ, ముద్రగడ జీవితాంతం పేదల కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేశారని కొనియాడారు. ఉన్నత పదవులను ఎప్పుడూ ఆశించలేదని పేర్కొన్నారు. వైఎస్ జగన్ ఆశయాలను విశ్వసించి 2024లో వైఎస్సార్సీపీలో చేరారని తెలిపారు. కాపు ఉద్యమంలో ముద్రగడ చేసిన సేవలు చిరస్మరణీయమని, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

# నత్తనడకన ఓటరు డిజిటలైజేషన్

రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్ ఆశించిన వేగంతో సాగడం లేదని సమాచారం. అధికారికంగా 90 శాతం పూర్తయిందని చెబుతున్నప్పటికీ, సీఈవో కార్యాలయ గణాంకాల ప్రకారం ఆదివారం సాయంత్రం నాటికి కేవలం 64.81 శాతం డిజిటలైజేషన్ మాత్రమే పూర్తైంది. మేడ్చల్‌మల్కాజిగిరి (37.30%), హైదరాబాద్ (39.59%), రంగారెడ్డి (48.52%) జిల్లాలు వెనుకబడ్డాయి. మరోవైపు యాదాద్రి భువనగిరి జిల్లా 88.43 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, సిద్ధిపేట, నల్లగొండ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలు కూడా ముందంజలో ఉన్నాయి. బీఎల్‌వోలు ఇంటికి రాలేదని, ఫారాలు అందలేదని పలుచోట్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.

# బాలిక వేధింపులు.. కానిస్టేబుల్ అరెస్ట్

నల్లగొండలో బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీస్ కానిస్టేబుల్ సత్యనారాయణను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల సైకిల్‌పై వెళ్తున్న బాలికను అడ్డగించి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధిత కుటుంబం ఫిర్యాదు చేసింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలిలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా మాస్క్ ధరించిన నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతను గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణగా తేలింది. నకిరేకల్‌లో పనిచేసిన సమయంలో కూడా అతనిపై రెండు పోక్సో కేసులు నమోదైనట్లు సమాచారం. పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



పూణెలో సంచలనం సృష్టించిన కేతన్ అగర్వాల్ హత్య కేసులో ప్రధాన నిందితురాలు సియా పోలీసులకు చెప్పిన ఒక్క మాట దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. "పెళ్లి వద్దని మా తల్లిదండ్రులను ఒప్పించడం కంటే... అతడిని చంపేయడం సులభంగా అనిపించింది" అనే ఆమె వ్యాఖ్య కేవలం ఒక నేరస్తురాలి ఆలోచన కాదు. కుటుంబాల్లో పెరుగుతున్న భావోద్వేగ దూరానికి అద్దం పట్టే విషాద సంకేతం. పిల్లలు తమ మనసులోని మాటను తల్లిదండ్రులతో చెప్పడానికి భయపడే పరిస్థితి ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేసింది. నచ్చని నిర్ణయాన్ని వ్యతిరేకించే ధైర్యం కంటే, తప్పు మార్గాన్ని ఎంచుకునే స్థితికి యువత చేరుకోవడం వెనుక పెంపకం, కుటుంబ సంభాషణలు, సామాజిక ఒత్తిళ్లు ఎంత ప్రభావం చూపుతున్నాయనే ప్రశ్న ఇప్పుడు ప్రతి ఇంటి ముందు నిలిచింది. సియా చేసిన నేరాన్ని సమర్థించే అవకాశం లేదు. కానీ అలాంటి ఆలోచనకు దారి తీసిన కుటుంబ వాతావరణాన్ని మాత్రం సమాజం తప్పకుండా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. పిల్లలకు ఆస్తులు కంటే, భయపడకుండా మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వడమే నిజమైన పెంపకం అని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.

## మీ పిల్లల నిశ్శబ్దం...

# మీ పెంపకానికి హెచ్చరిక!

◆ భయం పెరిగితే బంధం కరుగుతుంది
◆ మాటలే కుటుంబాలకు అసలు రక్షణ
◆ మనసులు దూరమైతే... నేరాలు దగ్గరవుతాయి

ఒక పిల్లవాడు లేదా పిల్ల తన జీవితంలో ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యను ముందుగా చెప్పాల్సిన వ్యక్తులు తల్లిదండ్రులే. కానీ అదే పిల్లలు తమ మనసులోని నిజాన్ని ఇంట్లో చెప్పడానికి భయపడితే, అది కుటుంబానికి అత్యంత ప్రమాదకరమైన హెచ్చరిక. పూణెలో వెలుగులోకి వచ్చిన సియా కేసు కూడా అలాంటి బాధాకరమైన వాస్తవాన్నే మన కళ్లముందు ఉంచింది. ఒక యువతి తనకు ఇష్టం లేని పెళ్లిని నిరాకరించే ధైర్యం కంటే, ప్రాణం తీయడమే సులభమని భావించే స్థితికి చేరుకుందంటే, అది ఒక్క వ్యక్తి తీసుకున్న తప్పు నిర్ణయం మాత్రమే కాదు. కుటుంబాల్లో పెరుగుతున్న భావోద్వేగ దూరం, వినిపించని మాటలు, అర్థం కాని మనసులు, పరువు పేరుతో పెరుగుతున్న ఒత్తిళ్లకు ప్రతిబింబం. పిల్లలకు తిండి, చదువు, సౌకర్యాలు కల్పించడం మాత్రమే పెంపకం కాదు. వారు ఏడ్చినప్పుడు వినే చెవులు, భయపడినప్పుడు ధైర్యం చెప్పే మాటలు, తప్పు చేసినా నిజం చెప్పే నమ్మకం ఇవ్వడం కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే ఇంట్లో మాట్లాడే అవకాశం కోల్పోయిన పిల్లలు బయట ప్రపంచంలో తప్పు దారులు వెతికే ప్రమాదం పెరుగుతుంది. ప్రతి తల్లిదండ్రి ఒక్కసారి తమను తాము ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది. నా పిల్లలకు నేను భయమా... లేక భరోసానా? అదే ప్రశ్నకు వచ్చే సమాధానమే రేపటి సమాజాన్ని నిర్ణయించబోతోంది.

**• హత్యకంటే భయమే పెద్ద శత్రువు!**

మహారాష్ట్రలోని పూణెలో ప్రముఖ వ్యాపారవేత్త కుమారుడు కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఆ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న సియా పోలీసులకు చెప్పిన ఒక్క వాక్యం మాత్రం సమాజాన్ని మరింత ఆలోచింపజేసింది. "పెళ్లి వద్దని నా తల్లిదండ్రులను ఒప్పించడం కంటే... నాకు కాబోయే భర్తను చంపడం సులభంగా అనిపించింది" అనే మాట కేవలం ఒక కేసుకు సంబంధించిన స్టేట్‌మెంట్ కాదు. అది ఎన్నో కుటుంబాల్లో నిశ్శబ్దంగా పెరుగుతున్న కమ్యూనికేషన్ సంక్షోభానికి అద్దం పట్టింది. ఒక యువతి తన మనసులోని మాటను తల్లిదండ్రులకు చెప్పడం కంటే హత్యను సులభమైన మార్గంగా భావించే స్థితికి చేరుకుందంటే, అది ఒక్క వ్యక్తి వైఫల్యం కాదు. కుటుంబ బంధాలు, పెంపక విధానాలు, సామాజిక ఒత్తిళ్లు, భావోద్వేగ అనుబంధాలు కలిసి సృష్టించిన ప్రమాదకర పరిస్థితి. సియా చేసిన నేరాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేం. చట్టం తన పని చేస్తుంది. కానీ ఆ నేరం వెనుక దాగి ఉన్న మానసిక కారణాలను అర్థం చేసుకోవడం మాత్రం సమాజానికి అత్యంత అవసరం.

**• మానసిక ఒత్తిడి ఎలా ప్రమాదంగా మారుతుంది?**

సియా చెప్పిన మాటలో అసలు భయం హత్య కాదు. తల్లిదండ్రులతో మాట్లాడలేకపోవడమే. మనసులోని నిజాన్ని చెప్పడానికి ధైర్యం లేకపోవడం అంతకంటే పెద్ద విషాదం. పిల్లలు తమ సమస్యలను ముందుగా ఇంట్లో చెప్పగలగాలి. కానీ కొందరి జీవితాల్లో ఇంటి తలుపులు తెరిచి ఉన్నా, సంభాషణల తలుపులు మూసుకుపోతాయి. అలాంటి పరిస్థితుల్లో భయం పెరుగుతుంది. ఆ భయం నిర్ణయాలను వికృతంగా మార్చేస్తుంది.

ప్రతి ఇంట్లోనూ పిల్లలు తల్లిదండ్రులను ఆశ్రయంగా చూడాలి. తీర్పు చెప్పే న్యాయమూర్తులుగా కాదు. ఒక కుటుంబంలో మాటలు తగ్గిన క్షణం నుంచి అపార్థాలు పెరుగుతాయి. అపార్థాలు పెరిగిన చోట భయం పుడుతుంది. భయం పెరిగితే తప్పు నిర్ణయాలకు అవకాశం పెరుగుతుంది. తీవ్రమైన మానసిక ఒత్తిడిలో మనిషి మెదడు సాధారణంగా పనిచేయదు. సైకాలజీలో దీనిని "టన్నెల్ విజన్" అని వివరిస్తారు. అంటే సమస్యకు ఎన్నో పరిష్కారాలు ఉన్నప్పటికీ మెదడు ఒక్క దారినే చూస్తుంది. అది సరైనదా, తప్పా అనే విశ్లేషణ చేసే సామర్థ్యం తగ్గిపోతుంది. సియా పరిస్థితిలో కూడా ఇదే జరిగి ఉండొచ్చు. పెళ్లిని నిరాకరించడం, ఇంట్లో మాట్లాడటం, బంధువుల సహాయం తీసుకోవడం, చట్టపరమైన మార్గాలు అనుసరించడం వంటి ఎన్నో అవకాశాలు ఉన్నా, తీవ్రమైన భావోద్వేగ ఒత్తిడి కారణంగా అవన్నీ ఆమెకు కనిపించకపోయి ఉండవచ్చు. ఒకే ఒక్క తప్పు నిర్ణయం మాత్రమే సమస్యకు పరిష్కారమని మెదడు నమ్మే స్థితి అత్యంత ప్రమాదకరం.

**• పెంపకంలో మాటలకు స్థానం లేకపోతే...**

చిన్నప్పటి నుంచి ప్రతి నిర్ణయం తల్లిదండ్రులదే. పిల్లల అభిప్రాయానికి విలువ ఉండదు. ఏదైనా చెప్పాలంటే "నీకు ఏమి తెలుసు?", "మేము చెప్పిందే చివరి మాట" అనే స్పందన వస్తుంది. ఇలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లలు క్రమంగా తమ భావాలను దాచుకోవడం నేర్చుకుంటారు. ప్రముఖ సైకాలజిస్ట్ మార్టిన్ సెలిగ్‌మన్ ప్రతిపాదించిన లెర్న్డ్ హెల్ప్‌లెస్‌నెస్ సిద్ధాంతం ప్రకారం, పదేపదే తమ అభిప్రాయాలు తిరస్కరించబడుతున్న అనుభవం ఎదురైతే, చివరకు "నేను చెప్పినా ఉపయోగం లేదు" అనే నిస్సహాయ భావన ఏర్పడుతుంది. అదే భావన తర్వాత జీవితంలోని కీలక నిర్ణయాల వద్ద కూడా వెంటాడుతుంది. పిల్లలు మాట్లాడకపోవడం వారి మొండితనం కాదు. చాలాసార్లు అది వినబడకపోయిన అనుభవాల ఫలితం. హ్యూమనిస్టిక్ సైకాలజిస్ట్ కార్ల్ రోజర్స్ చెప్పిన ముఖ్యమైన అంశం ఒకటే. పిల్లలపై ప్రేమ ఎలాంటి షరతులు లేకుండా ఉండాలి. కానీ చాలాచోట్ల ప్రేమకు కూడా అర్హత పరీక్షలు పెడుతున్నారు. "మా మాట వినాలి." "మా పరువు కాపాడాలి." "మేము చెప్పిందే చేయాలి." ఇలాంటి వాక్యాలు ప్రేమను నెమ్మదిగా భయంగా మారుస్తాయి. పిల్లలు తల్లిదండ్రులను కోల్పోతామనే భయంతో నిజాలు దాచడం ప్రారంభిస్తారు. చివరకు చిన్న సమస్య కూడా పెద్ద సంక్షోభంగా మారుతుంది. పిల్లలకు అవసరమైనది నియంత్రణ కాదు. అర్థం చేసుకునే మనసు. డిజిటల్ ప్రపంచం దగ్గరైంది... మనుషులు దూరమయ్యారు. స్మార్ట్‌ఫోన్‌లు కుటుంబ సభ్యులను ఒకే ఇంట్లో ఉంచుతున్నాయి. కానీ భావోద్వేగంగా కలపడం లేదు. ప్రతి ఒక్కరూ తమ స్క్రీన్‌లో బిజీగా ఉంటున్నారు. కుటుంబ సంభాషణలు క్రమంగా తగ్గిపోతున్నాయి. వివిధ అధ్యయనాలు యువతలో కుటుంబ సభ్యులతో భావోద్వేగంగా మాట్లాడే అలవాటు తగ్గుతోందని సూచిస్తున్నాయి. కెరీర్, ప్రేమ, పెళ్లి, వ్యక్తిగత నిర్ణయాల విషయంలో చాలామంది యువత తల్లిదండ్రులతో మాట్లాడేందుకు సంకోచిస్తున్నారు. బయట ప్రపంచంతో వేల గంటలు గడిపే పిల్లలు ఇంట్లో ఐదు నిమిషాలు కూడా మనసు విప్పలేకపోవడం ఆందోళనకర పరిణామం. సాంకేతికత పెరగడం తప్పు కాదు. సంబంధాలు తగ్గిపోవడమే అసలు సమస్య.

**• 'నలుగురు ఏమంటారు?' అనే భయం**

మన సమాజంలో ఇప్పటికీ అనేక నిర్ణయాలు కుటుంబ సభ్యుల సంతోషం కోసం కాకుండా, ఇతరుల అభిప్రాయాల కోసం తీసుకుంటున్నారు. "ఇంటి పరువు", "కుటుంబ గౌరవం", "సమాజం ఏమంటుంది?" అనే మాటలు ఎన్నో యువజీవితాలను మౌనంగా నలిపేస్తున్నాయి. పిల్లల మనసు వినకుండా, సమాజం మాట వినడం వల్ల చాలా కుటుంబాలు విలువైన అనుబంధాలను కోల్పోతున్నాయి. పరువు కాపాడుకోవాలనే ఆందోళన కొన్నిసార్లు పిల్లల జీవితాలను ప్రమాదంలోకి నెడుతుంది. సమాజం ఒక రోజు మాట్లాడి మరిచిపోతుంది. కానీ కుటుంబ నిర్ణయాల ప్రభావం పిల్లల జీవితమంతా ఉంటుంది. మార్కుల కంటే మాటలకు విలువ ఇవ్వండి. తల్లిదండ్రులు పిల్లల చదువు కోసం లక్షలు ఖర్చు పెడుతున్నారు. మంచి పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. కానీ ప్రతిరోజూ ప్రశాంతంగా కూర్చొని అరగంట మాట్లాడే సమయం మాత్రం దొరకడం లేదు. పిల్లలకు జీవితంలో గొప్ప బహుమతి ఖరీదైన వస్తువులు కావు. "నువ్వు ఏ విషయం అయినా నాతో చెప్పొచ్చు" అనే నమ్మకం. ఒక కుటుంబంలో ప్రతి రోజు కొన్ని నిమిషాల నిజాయితీతో కూడిన సంభాషణ జరిగితే, అనేక సమస్యలు మొదట్లోనే పరిష్కారమవుతాయి. తప్పు జరిగిన వెంటనే కోపంతో స్పందించడం చాలా సహజం. కానీ ఆ క్షణంలో పిల్లలకు అత్యంత అవసరమైనది శిక్ష కాదు. వినే వ్యక్తి. వారు ఎందుకు ఆ నిర్ణయం తీసుకున్నారు? ఏ పరిస్థితి వారిని అక్కడికి తీసుకెళ్లింది? ఎవరైనా ఒత్తిడి చేశారా? ఏ భయం వెంటాడుతోంది? ముందుగా ఇవన్నీ తెలుసుకోవాలి. "నువ్వు తప్పు చేసినా నేను నీతోనే ఉంటాను. ముందు నిజం చెప్పు" అనే మాట ఎన్నో ప్రమాదాలను ముందుగానే అడ్డుకోగలదు. భయం నిజాలను దాచిస్తుంది. నమ్మకం నిజాలను బయటకు తీసుకొస్తుంది. కొంతమంది తల్లిదండ్రులు స్వేచ్ఛ ఇస్తే పిల్లలు తప్పుదారి పడతారని భావిస్తారు. కానీ స్వేచ్ఛ అంటే బాధ్యతతో కూడిన సంభాషణకు అవకాశం ఇవ్వడం. చిన్న విషయాల నుంచి పిల్లల అభిప్రాయాలను అడగండి. కుటుంబ నిర్ణయాల్లో వారిని భాగస్వాములను చేయండి. వారి ఆలోచన సరైనదైతే ప్రోత్సహించండి. తప్పైతే ప్రశాంతంగా వివరించండి. అవమానించడం, ఎగతాళి చేయడం, అణచివేయడం సమస్యను మరింత పెంచుతుంది. తప్పును సరిదిద్దడం లక్ష్యం కావాలి. వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడం కాదు.



**• సమాజానికి శాపంగా మానవ సంబంధాలు**

నేరం వెనుక దాగిన భయం: సియా చేసిన నేరం అత్యంత ఘోరం. కానీ ఆమె పోలీసులకు చెప్పిన మాట ఒక యువతి తన తల్లిదండ్రులతో మాట్లాడటానికే ఎంత భయపడిందో చూపించింది. ఈ కేసు నేరం కంటే కుటుంబాల్లో పెరుగుతున్న కమ్యూనికేషన్ లోపంపై పెద్ద చర్చకు తెరతీసింది.
పెంపకం
ప్రభావం: పిల్లల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా, ప్రతి నిర్ణయాన్ని తల్లిదండ్రులే తీసుకునే వాతావరణం వారిలో నిస్సహాయ భావనను పెంచుతుంది. చివరకు తమ సమస్యలకు సరైన పరిష్కారం కనిపించకుండా తప్పు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంటుంది.

మానసిక ఒత్తిడి ప్రమాదం: తీవ్రమైన ఒత్తిడి సమయంలో మెదడు ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించలేని స్థితిని సైకాలజీలో "టన్నెల్ విజన్"గా పేర్కొంటారు. అదే పరిస్థితి ఒక వ్యక్తిని తీవ్ర నిర్ణయాల వైపు నడిపించే అవకాశం ఉంటుంది.

సమాజం పేరుతో ఒత్తిడి: "నలుగురు ఏమంటారు?" అనే భయం ఇప్పటికీ అనేక కుటుంబాల్లో పిల్లల అభిప్రాయాల కంటే పెద్దదిగా మారింది. పరువు కోసం తీసుకునే నిర్ణయాలు కొన్నిసార్లు పిల్లల జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నాయి.

పరిష్కారం సంభాషణే: పిల్లలకు ఖరీదైన సౌకర్యాల కంటే, భయపడకుండా మాట్లాడే వాతావరణం అవసరం. తల్లిదండ్రులు ముందుగా వినడం, అర్థం చేసుకోవడం, నమ్మకం కల్పించడం ద్వారా ఇలాంటి విషాద పరిస్థితులను చాలా వరకు నివారించవచ్చు.

**• మాటలేని ఇల్లు... మనసులేని పెంపకం!**

సియా కేసు మనకు ఒక గట్టి హెచ్చరిక. ఒక యువతి తీసుకున్న నిర్ణయం నేరం. అందుకు చట్టపరమైన శిక్ష తప్పదు. కానీ ఆ స్థాయికి ఆమెను తీసుకెళ్లిన కుటుంబ సంభాషణల లోపం, భావోద్వేగ దూరం, సామాజిక ఒత్తిళ్లను కూడా మనం ప్రశ్నించాలి. రేపటి తరాన్ని కాపాడాలంటే పాఠశాలల్లో మాత్రమే కాదు, ప్రతి ఇంట్లో భావోద్వేగ విద్య అవసరం. పిల్లలకు వినిపించే తల్లిదండ్రులు కావాలి. భయపెట్టే తల్లిదండ్రులు కాదు. ప్రశ్నలు అడగడానికి స్వేచ్ఛ ఉండాలి. అభిప్రాయాలు చెప్పడానికి అవకాశం ఉండాలి. విభేదాలను సంభాషణతో పరిష్కరించే సంస్కృతి పెరగాలి. ఒక కుటుంబం బలంగా ఉండాలంటే ప్రేమ సరిపోదు. ఆ ప్రేమను వ్యక్తం చేసే మాటలు కూడా ఉండాలి. పిల్లలు ఇంటిని ప్రపంచంలోనే అత్యంత సురక్షిత ప్రదేశంగా భావించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుంది. చివరిగా ఒక విషయం మాత్రం ప్రతి తల్లిదండ్రి గుర్తుంచుకోవాలి. మీ పిల్లలు మీతో మాట్లాడటానికి భయపడుతున్నారంటే... మీ పెంపకం గెలిచినట్టు కాదు. ఓడిపోతున్నట్టు. సియా చేసిన నేరాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేం. ఒక ప్రాణాన్ని బలిగొన్న ఈ ఘటనకు చట్టం ప్రకారం శిక్ష తప్పదు. కానీ ఈ కేసును కేవలం నేర ఘటనగా చూసి ముందుకు వెళ్లిపోతే, సమాజంగా మనం మరో పెద్ద తప్పు చేసినట్టే అవుతుంది. ఎందుకంటే ప్రతి సంచలన నేరం వెనుక ఒక కనిపించని కుటుంబ కథ, వినిపించని మనసు, చెప్పుకోలేని బాధ దాగి ఉండే అవకాశం ఉంది. పిల్లలకు మంచి చదువు, మంచి భవిష్యత్తు, విలాసవంతమైన జీవితం ఇవ్వాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. కానీ వారు ఏ పరిస్థితిలోనైనా భయపడకుండా వచ్చి మాట్లాడగలిగే వ్యక్తిగా నిలవడం అంతకంటే గొప్ప బాధ్యత. ఇంట్లో సంభాషణలు ఆగిపోయిన చోట అపార్థాలు మొదలవుతాయి. అపార్థాలు పెరిగిన చోట ఒత్తిడి పెరుగుతుంది. ఒత్తిడి పెరిగినప్పుడు తప్పు నిర్ణయాల ప్రమాదం కూడా పెరుగుతుంది. రేపటి తరం మానసికంగా ఆరోగ్యంగా, బాధ్యతాయుతంగా ఎదగాలంటే ప్రతి ఇంట్లో ప్రేమతో కూడిన సంభాషణలు మొదలుకావాలి. పిల్లలు తమ తల్లిదండ్రులను భయపడే వ్యక్తులుగా కాదు, జీవితంలో ఏ సమస్య వచ్చినా ముందుగా ఆశ్రయించే మనుషులుగా చూడాలి. గుర్తుంచుకోండి... మీ పిల్లలు మీతో మాట్లాడటానికి భయపడుతున్నారంటే, అది వారి ఓటమి కాదు... మీ పెంపకానికి వచ్చిన హెచ్చరిక.

- టీ.కే.రావు,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్
(9908816036)



# 56 ఏళ్ల యువకుడు



- రాహుల్‌పై మోదీ సెటైర్!
- పార్లమెంట్ ముందే రాజకీయ చురకలు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ సాధించిన విజయాన్ని అభినందిస్తూ మాట్లాడిన ప్రధాని, పరోక్షంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై సెటైర్లు వేశారు. స్కైరూట్ బృందం సగటు వయసు 28 సంవత్సరాలని పేర్కొన్న ఆయన, తాను "56 ఏళ్ల యువకుడి" గురించి మాట్లాడటం లేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు నేరుగా రాహుల్ గాంధీని ఉద్దేశించినవేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. దేశంలో తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతంగా కక్ష్యలోకి చేరడం భారత అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయమని మోదీ అన్నారు. ఈ ఘనత సాధించిన స్కైరూట్ బృందంలోని సభ్యుల సగటు వయసు కేవలం 28 సంవత్సరాలేనని గుర్తుచేశారు. భారత యువత సామర్థ్యం అంతరిక్షం అంత విశాలమని కొనియాడారు. ఇలాంటి విజయాలు దేశానికి కొత్త ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు.

**రాజకీయంగా హాట్ టాపిక్**

ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ ఎంపీ రంజీత్ రంజన్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ తన కోసం ఉద్యోగం అడగడం లేదని అన్నారు. దేశంలో 20 నుంచి 26 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడుతున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం భూములు అమ్ముకుని చదివే విద్యార్థులు చివరకు పేపర్ లీక్‌లతో నష్టపోతున్నారని విమర్శించారు. అలాంటి సమస్యలపై స్పందించకుండా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. "56" సంఖ్య భారత రాజకీయాల్లో చాలా కాలంగా చర్చల్లో ఉంది. 2014 ఎన్నికల సమయంలో నరేంద్ర మోదీ తన "56 అంగుళాల ఛాతీ" వ్యాఖ్యతో ప్రచారం చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ కూడా అదే వ్యాఖ్యను పలుమార్లు రాజకీయ విమర్శల కోసం ఉపయోగించింది. ఇప్పుడు "56 ఏళ్ల యువకుడు" అంటూ మోదీ చేసిన వ్యాఖ్య మరోసారి ఈ సంఖ్యను రాజకీయ చర్చల్లోకి తీసుకొచ్చింది. రాహుల్ గాంధీ ఇటీవలే 56వ ఏట అడుగుపెట్టడం కూడా ఈ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం తెచ్చింది.

**పార్లమెంట్‌పై మోదీ పిలుపు**

రాజకీయ వ్యాఖ్యల తర్వాత ప్రధాని పార్లమెంట్ సమావేశాలపై కూడా మాట్లాడారు. సభలో వాస్తవాలు, సబ్జెక్ట్ ఆధారంగా చర్చలు జరగాలని కోరారు. నిజాలు బలంగా ఉంటే అరుపులు అవసరం లేదని అన్నారు. ప్రతి సభ్యుడి గొంతు వినిపించేలా పార్లమెంట్ పనిచేయాలని సూచించారు. దేశ ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మోదీ వ్యాఖ్యలు, కాంగ్రెస్ ప్రతిస్పందనతో వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఒకవైపు యువత విజయాలను ప్రధాని ప్రశంసిస్తుండగా, మరోవైపు నిరుద్యోగం, పేపర్ లీక్‌లు, విద్యార్థుల సమస్యలను కాంగ్రెస్ ప్రధాన అంశాలుగా ప్రస్తావిస్తోంది. ఈ పరిణామాలతో రానున్న రోజుల్లో పార్లమెంట్ సమావేశాలు మరింత వాడివేడిగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నీట్ దుమారం

- స్తంభించిన లోక్‌సభ
- మొదటి రోజే గందరగోళం
- ప్రారంభమైన వర్షా కాల సమావేశాలు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజే లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. నీట్ పేపర్ లీక్ ఆరోపణలు, అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం అంశాలను ప్రతిపక్ష పార్టీలు బలంగా ప్రస్తావించాయి. నినాదాలతో సభను హోరెత్తించడంతో సాధారణ కార్యక్రమాలు ముందుకు సాగలేదు. ఉదయం సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే వాతావరణం ఉద్రిక్తంగా మారింది.

**ఆరు సార్లు వాయిదా**

ప్రతిపక్ష సభ్యుల నిరసనలతో సభను స్పీకర్ ఓం బిర్లా వరుసగా ఆరు సార్లు వాయిదా వేశారు. చివరకు మధ్యాహ్నం 3 గంటలకు రోజంతా సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. గందరగోళం కారణంగా ప్రభుత్వ వ్యాపారంలో దాదాపు ఏ అంశంపైనా చర్చ జరగలేదు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కు పెంచే ఆర్డినెన్స్‌కు బదులుగా బిల్లును మాత్రమే సభలో ప్రవేశపెట్టగలిగారు.

**డీఎంకే వైఖరిలో మార్పు**

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై కూడా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇదే సమయంలో సీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులు పార్లమెంట్ వైపు చేపట్టిన మార్చ్ కూడా దేశ రాజధానిలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. తమిళనాడులో మారిన రాజకీయ సమీకరణాలు లోక్‌సభలో స్పష్టంగా కనిపించాయి. కాంగ్రెస్‌తో పొత్తు ముగించుకున్న డీఎంకే సభ్యులు సభలో వెల్‌లోకి వచ్చినా, కాంగ్రెస్ లేవనెత్తిన అంశాలపై కాకుండా కావేరి నదిపై మేకేదాటు ఆనకట్ట ప్రతిపాదనపై నినాదాలు చేశారు. ఉదయం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్వహించిన ప్రతిపక్ష వ్యూహ సమావేశానికి కూడా డీఎంకే దూరంగా నిలిచింది. దీంతో రెండు పార్టీల మధ్య దూరం మరింత స్పష్టమైంది.

**వేడి పుట్టించిన తొలి రోజు**

సభ ప్రారంభంలో మాజీ ఎంపీలకు సంతాపం ప్రకటించే కార్యక్రమం జరిగింది. ఆ సమయంలో కూడా కొందరు సభ్యులు నినాదాలు చేయడంపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో క్వోరం సరిపడా ఉందని అధికార పక్షం తెలిపినా, కొందరు ప్రతిపక్ష సభ్యులు తమను సభలోకి అనుమతించడం లేదని ఆరోపించారు. దీంతో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. వర్షాకాల సమావేశాల తొలి రోజే అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ వివాదం, రామాలయ విరాళాల వ్యవహారం, మారిన రాజకీయ సమీకరణాలు సభను పూర్తిగా ప్రభావితం చేశాయి. కీలక బిల్లులపై చర్చ జరగకముందే సమావేశాలు వరుస వాయిదాలతో ముగియడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రానున్న రోజుల్లో కూడా ఇదే తరహా వేడి వాతావరణం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సుప్రీం కోర్టులో జడ్జిల సంఖ్య పెంపు

- 38 మందికి పెంచే ప్రతిపాదన
- జడ్జిల సంఖ్య పెంపుపై కేంద్రం అడుగు



దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్యను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును తీసుకొచ్చింది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం జడ్జిల సంఖ్యను 38కు పెంచేలా ప్రతిపాదించింది. పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని ప్రభుత్వం తెలిపింది.

**పెండింగ్ కేసుల భారం**

దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. 2026 జనవరి 1 నాటికి 92,101 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. 2025లో 75,410 కొత్త కేసులు నమోదవగా, 65,615 కేసులు మాత్రమే పరిష్కారమయ్యాయి. కొత్త కేసులు ఎక్కువగా నమోదు కావడం వల్ల పెండింగ్ కేసుల సంఖ్య నిరంతరం పెరుగుతోందని బిల్లులో పేర్కొన్నారు. జడ్జిల సంఖ్య పెరగడం వల్ల రాజ్యాంగపరమైన కీలక అంశాలపై విచారణ చేసే రాజ్యాంగ ధర్మాసనాలను మరింత తరచుగా ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమైన న్యాయపరమైన ప్రశ్నలపై త్వరగా తీర్పులు ఇవ్వడానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని వివరించింది. పాత కేసుల పరిష్కార వేగం కూడా పెరుగుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

**ఆర్డినెన్స్‌కు బదులుగా బిల్లు**

నాలుగు కొత్త జడ్జి పదవులు సృష్టించడంతో పాటు అవసరమైన సిబ్బంది నియామకానికి ఏడాదికి సుమారు రూ.10.56 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. అధికారిక వాహనాలు, నివాసాల ఏర్పాటు, ఇతర సౌకర్యాల కోసం ఒకేసారి రూ.3.47 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం ప్రారంభ వ్యయం సుమారు రూ.14.04 కోట్లుగా ఉంటుందని ఆర్థిక వివరాల్లో వెల్లడించారు. ఈ ఏడాది మే నెలలో కేంద్ర మంత్రివర్గం జడ్జిల సంఖ్య పెంపునకు ఆమోదం తెలిపింది. అనంతరం రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేశారు. ఆ ఆర్డినెన్స్ అమల్లోకి వచ్చిన తర్వాత పెరిగిన ఖాళీల ప్రకారం నలుగురు కొత్త జడ్జిలను సుప్రీంకోర్టుకు నియమించారు. ఇప్పుడు ఆ ఆర్డినెన్స్ స్థానంలో చట్టబద్ధంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే సుప్రీంకోర్టు కేసుల పరిష్కార వేగం పెరగడంతో పాటు న్యాయవ్యవస్థపై ఉన్న ఒత్తిడి కొంత మేర తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

# వాంగ్‌చుక్ ఆరోగ్యంపై హైకోర్టు ఆందోళన!

- ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం,
- నేడు విచారణ

వాతావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ ఆస్పత్రి మార్పిడి అంశంపై ఢిల్లీ హైకోర్టు నేడు కీలక విచారణ చేపట్టనుంది. వాంగ్‌చుక్‌ను ప్రభుత్వ ఆధ్వర్యంలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి నుంచి కుటుంబం కోరుకున్న మరో ఆస్పత్రికి తరలించాలని ఆయన భార్య గీతాంజలి జె. ఆంగ్మో దాఖలు చేసిన అప్పీల్‌ను కోర్టు విచారించనుంది. ప్రస్తుతం 22 రోజులుగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్న వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

**నిరసన కొనసాగించే హక్కు ఉందన్న వాదన**

ప్రధాన న్యాయమూర్తి డి.కే. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియా ధర్మాసనం ముందు విచారణ జరిగింది. వాంగ్‌చుక్ ప్రాణాలను కాపాడటమే ప్రస్తుతం అత్యవసరమని బెంచ్ స్పష్టం చేసింది. సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి, ఎయిమ్స్, ప్రైవేట్ ప్రయోగశాలల్లో పరీక్షించిన రక్త నమూనాల నివేదికలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. చికిత్స అందిస్తున్న ప్రధాన వైద్యుడు, కుటుంబం సంప్రదించిన ప్రైవేట్ వైద్యుడు తదుపరి విచారణకు హాజరుకావాలని సూచించింది. వాంగ్‌చుక్ తరఫున సీనియర్ న్యాయవాది అఖిల్ సిబల్ వాదనలు వినిపించారు. వాంగ్‌చుక్ ప్రస్తుతం స్పష్టమైన మానసిక స్థితిలో ఉన్నారని, స్వయంగా లేఖలు రాయగలుగుతున్నారని తెలిపారు. ఆయన ఆస్పత్రి నుంచి వైద్యుల సూచనకు విరుద్ధంగా బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అవసరమైతే తనకు నచ్చిన మరో ఆస్పత్రిలో చేరతారని వివరించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కులో భాగంగా నిరాహార దీక్ష కొనసాగించే స్వేచ్ఛ వాంగ్‌చుక్‌కు ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**వైద్య నివేదికల్లో తేడా లేదన్న కేంద్రం**

కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా భిన్నమైన వాదనలు వినిపించారు. నిరసన హక్కు ప్రాథమిక హక్కేనని అంగీకరించినా, అది సంపూర్ణ హక్కు కాదని పేర్కొన్నారు. ఒక వ్యక్తి ఆరోగ్యం విషమిస్తే శాంతిభద్రతలపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజాహితం దృష్ట్యా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సహజమని వాదించారు. వైద్య పరీక్షల ఫలితాలపై వచ్చిన సందేహాలను కూడా కేంద్రం ఖండించింది. సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి, ఎయిమ్స్, ప్రైవేట్ ల్యాబ్ నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన ఫలితాలు దాదాపు ఒకే విధంగా ఉన్నాయని కోర్టుకు తెలిపింది. ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి అపోహలు అవసరం లేదని స్పష్టం చేసింది. ఇంతకు ముందు సింగిల్ జడ్జి వాంగ్‌చుక్‌ను గురుగ్రామ్‌లోని మెదాంతా ఆస్పత్రికి తరలించాలని చేసిన అభ్యర్థనను తిరస్కరించారు.

# ఒడెసా పోర్టు వద్ద ఘోరం

- ఓడపై ఉక్రెయిన్ క్షిపణి దాడి
- నలుగురు భారతీయులు మృతి



ఉక్రెయిన్‌లోని ఒడెసా పోర్టు సమీపంలో జరిగిన క్షిపణి దాడిలో నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మరో భారతీయుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూలై 19 సాయంత్రం పోర్టు నుంచి బయలుదేరుతున్న సమయంలో ఎంవీ గోల్డెన్ లియో అనే వాణిజ్య నౌకపై ఈ దాడి జరిగినట్లు తెలిపింది. ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

**17 మంది సిబ్బందితో ప్రయాణం**

దాడి జరిగిన సమయంలో నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఐదుగురు భారతీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న ఓషన్ గ్రేస్ షిప్పింగ్ లిమిటెడ్‌కు చెందిన ఈ నౌక గినియాబిస్సావు జెండాతో ప్రయాణిస్తోంది. మొక్కజొన్న సరుకుతో సముద్ర మార్గంలో ప్రయాణం ప్రారంభించిన కొద్దిసేపటికే ప్రమాదం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ నౌకాదళం తెలిపిన వివరాల ప్రకారం నౌకపై మూడు క్రూయిజ్ క్షిపణులు దాడి చేశాయి. ఈ దాడితో నౌకలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాత్రంతా కొనసాగిన సహాయక చర్యల్లో ఎనిమిది మందిని సురక్షితంగా రక్షించారు. పలువురు సిబ్బంది మృతి చెందినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు.

**నల్ల సముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తత**

వాణిజ్య నౌకలపై దాడులు చేయడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలో పడేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, గాయపడిన భారతీయుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయం అందిస్తోందని తెలిపింది. ఇటీవలి వారాల్లో నల్ల సముద్ర ప్రాంతంలో ఘర్షణలు మరింత తీవ్రమయ్యాయి. ఒడెసా ప్రాంతంపై జరిగిన దాడుల్లో ఈ నెలలో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. మరోవైపు రష్యా భూభాగంలో కూడా డ్రోన్ దాడులు కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య యుద్ధం మరింత ఉధృతమవుతున్న నేపథ్యంలో వాణిజ్య నౌకల భద్రతపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. భారతీయుల మృతి దేశాన్ని విషాదంలోకి నెట్టగా, ఘటనపై పూర్తి వివరాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

# బ్రిటన్‌లో అసలేం జరుగుతోంది

- ఎన్నికలు లేకుండానే కొత్త ప్రధాని!
- లేబర్ పార్టీలో నాయకత్వ మార్పు

బ్రిటన్‌లో సాధారణ ఎన్నికలు జరగకుండానే కొత్త ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. లేబర్ పార్టీ సీనియర్ నేత, మాజీ గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ ఆండీ బర్న్‌హామ్ సోమవారం అధికారికంగా బ్రిటన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అధికార పార్టీ నాయకుడిగా ఆయన ఎంపిక కావడంతో ప్రధానమంత్రి పదవి కూడా ఆయనకే దక్కింది. ఇదంతా బ్రిటన్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో అమలులో ఉన్న రాజ్యాంగ ప్రక్రియలో భాగమే.

**స్టార్మర్ రాజీనామాతో మార్పు**

ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ గత నెలలో లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేశారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే ఆయన తప్పుకోవడం బ్రిటన్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ప్రభుత్వ నిర్ణయాలపై విమర్శలు, స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీకి ఎదురైన భారీ ఎదురుదెబ్బలు, పార్టీలో పెరిగిన అసంతృప్తి కలిసి ఆయనపై ఒత్తిడిని పెంచాయి. చివరకు పార్టీ నాయకత్వానికి వీడ్కోలు పలకాల్సి వచ్చింది. దీంతో లేబర్ పార్టీ ఎంపీల మద్దతు సాధించిన ఏకైక అభ్యర్థిగా ఆండీ బర్న్‌హామ్ నిలిచారు. మొత్తం 401 మంది లేబర్ ఎంపీలలో 379 మంది ఆయనకు మద్దతు ప్రకటించారు. ప్రత్యేక పార్టీ సమావేశంలో ఆయనను అధికారికంగా లేబర్ పార్టీ నాయకుడిగా ప్రకటించారు. పార్టీకి పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీ ఉండటంతో నాయకత్వ బాధ్యతలు స్వయంగా ప్రధానమంత్రి పదవికి మార్గం సుగమం చేశాయి.

**ఎన్నికలు ఎందుకు అవసరం కాలేదు?**

బ్రిటన్‌లో ప్రజలు నేరుగా ప్రధానమంత్రిని ఎన్నుకోరు. పార్లమెంట్‌లో మెజారిటీ కలిగిన పార్టీ నాయకుడే ప్రధానమంత్రి అవుతారు. అధికార పార్టీ నాయకుడు రాజీనామా చేసినా, తొలగింపునకు గురైనా అదే పార్టీ కొత్త నాయకుడిని ఎన్నుకుంటుంది. ఆ నాయకుడినే రాజు లేదా రాణి అధికారికంగా ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆహ్వానిస్తారు. అందుకే ఈసారి దేశవ్యాప్తంగా సాధారణ ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం రాలేదు. తదుపరి సాధారణ ఎన్నికలు 2029లోనే జరగనున్నాయి. గత దశాబ్దంలో బ్రిటన్ రాజకీయాల్లో ఇలాంటి మార్పులు పలుమార్లు చోటుచేసుకున్నాయి. థెరిసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రిషి సునాక్ కూడా పార్టీ అంతర్గత నాయకత్వ ఎన్నికల ద్వారానే ప్రధానమంత్రి పదవిని చేపట్టారు. ప్రజలు నేరుగా ఓటు వేయకుండానే అధికార మార్పిడి జరగడం బ్రిటన్ రాజకీయ వ్యవస్థలో సాధారణ ప్రక్రియగా కొనసాగుతోంది.

**59వ ప్రధానిగా బర్న్‌హామ్**

కీర్ స్టార్మర్ తన రాజీనామాను రాజు చార్ల్స్ మూడోకు సమర్పించిన తర్వాత ఆండీ బర్న్‌హామ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రాజు అధికారికంగా ఆహ్వానించారు. సంప్రదాయ "కిస్సింగ్ ఆఫ్ హ్యాండ్స్" కార్యక్రమం పూర్తయ్యాక బర్న్‌హామ్ అధికారికంగా బ్రిటన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన 10 డౌనింగ్ స్ట్రీట్‌కు చేరుకుని దేశ ప్రజలను ఉద్దేశించి తొలి ప్రసంగం చేశారు. దీంతో బ్రిటన్ చరిత్రలో 59వ ప్రధానమంత్రిగా ఆండీ బర్న్‌హామ్ అధికారికంగా బాధ్యతలు చేపట్టిన నాయకుడిగా నిలిచారు.

# మళ్లీ మారాడు

- బ్రిటన్‌లో కొత్త ప్రధాని
- బాధ్యతలు చేపట్టిన బర్న్‌హామ్
- పదేళ్లలో ఏడో ప్రధానిగా పగ్గాలు



బ్రిటన్ కొత్త ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్ బాధ్యతలు స్వీకరించారు. గత పదేళ్లలో దేశానికి ఏడో ప్రధానమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారు. మాజీ మాంచెస్టర్ మేయర్‌గా గుర్తింపు పొందిన బర్న్‌హామ్‌ను కింగ్ చార్ల్స్-III అధికారికంగా ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే దేశ రాజకీయ వ్యవస్థలో పెద్ద మార్పులు తీసుకొస్తానని ప్రకటించారు. అధికారాన్ని లండన్‌కే పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విస్తరిస్తానని స్పష్టం చేశారు.

**40 ఏళ్లలో అతిపెద్ద సంస్కరణల హామీ**

డౌనింగ్ స్ట్రీట్ ఎదుట చేసిన తొలి ప్రసంగంలో బర్న్‌హామ్ కీలక హామీలు ఇచ్చారు. బ్రిటన్‌కు కొత్త రాజకీయ నమూనా, కొత్త ఆర్థిక విధానాన్ని అందిస్తామని చెప్పారు. గత 40 ఏళ్లలో చూడని స్థాయిలో సంస్కరణలు అమలు చేస్తామని వెల్లడించారు. అధికార వికేంద్రీకరణ ద్వారా ప్రతి ప్రాంతానికి సమాన అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. "దేశంలోని ప్రతి పోస్టుకోడ్‌కు అధికారాన్ని తీసుకెళ్తాం" అంటూ తన లక్ష్యాన్ని స్పష్టంగా వివరించారు.

**నిరాశ్రయుల కోసమే తొలి నిర్ణయం**

పదవిలోకి వచ్చిన తొలి రోజే నిరాశ్రయుల సమస్యను అంతం చేయడం తన మొదటి లక్ష్యమని బర్న్‌హామ్ చెప్పారు. జీవన వ్యయం తగ్గించేందుకు తక్షణ చర్యలు ప్రారంభిస్తామని వెల్లడించారు. యువతకు ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పించే విధానాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సేవలపై ప్రజల నియంత్రణ పెంచే దిశగా చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ ఏడాదిలోనే పదేళ్ల అభివృద్ధి ప్రణాళికను ప్రకటిస్తామని చెప్పారు.

**స్టార్మర్ పతనానికి కారణాలివే**

పదవి వీడిన కీర్ స్టార్మర్ భావోద్వేగంతో దేశ ప్రజలకు వీడ్కోలు చెప్పారు. తాను చిరునవ్వుతో, గర్వంతో పదవి నుంచి తప్పుకుంటున్నానని పేర్కొన్నారు. తన ప్రభుత్వ విజయాలపై గర్వంగా ఉందన్నారు. కొత్త ప్రధాని బర్న్‌హామ్‌కు విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. కేవలం రెండేళ్ల క్రితం భారీ విజయంతో అధికారంలోకి వచ్చిన స్టార్మర్ ఇప్పుడు లేబర్ పార్టీ చరిత్రలో అత్యల్ప కాలం పనిచేసిన ప్రధానమంత్రిగా నిలిచారు. లేబర్ పార్టీలో అంతర్గత విభేదాలు స్టార్మర్ ప్రభుత్వాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. సంక్షేమ విధానాలు, గాజా యుద్ధంపై పార్టీ వైఖరి, కార్మిక సంఘాలతో పెరిగిన విభేదాలు ఆయన నాయకత్వాన్ని బలహీనపరిచాయి. స్థానిక ఎన్నికల్లో ఎదురైన వరుస పరాజయాలు కూడా ఆయనపై ఒత్తిడిని పెంచాయి. కీలక ఉప ఎన్నికల్లో ఓటములు ఎదురుకావడంతో చివరకు నాయకత్వ మార్పు అనివార్యమైంది.

**భారత్‌తో సంబంధాలపై ఆసక్తి**

బర్న్‌హామ్ విదేశాంగ విధానంపై ఇప్పటివరకు పూర్తి స్పష్టత ఇవ్వలేదు. అయినా యూరోప్‌తో సన్నిహిత సంబంధాలకు ఆయన మద్దతు తెలిపారు. నాటోకు అనుకూలంగా ఉంటానని ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. ఉక్రెయిన్‌కు బ్రిటన్ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారత్‌తో ఇటీవల అమల్లోకి వచ్చిన వాణిజ్య ఒప్పందాన్ని కొనసాగించే అవకాశాలపై కూడా ఆసక్తి నెలకొంది. కొత్త ప్రధానిగా ఆయన తీసుకునే నిర్ణయాలు బ్రిటన్ రాజకీయాలతో పాటు అంతర్జాతీయ సంబంధాలపై కూడా ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మద్యం టెండర్ కేసులో ట్విస్ట్

*(మొదటి పేజీ తరువాయి..)*

ప్రత్యేక దర్యాప్తు బృందం సమర్పించిన రిమాండ్ నివేదికలో మాజీ ప్రభుత్వ హయాంలో అమలైన మద్యం రవాణా టెండర్ విధానంలో వాసుదేవ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు ఆరోపించింది. ప్రభుత్వ ఉత్తర్వులను పక్కనపెట్టి రాష్ట్ర మద్యం రవాణా విధానాన్ని ఉల్లంఘించేలా టెండర్ల రూపకల్పన, ఆమోదం, అమలులో ఆయన ప్రధాన పాత్ర పోషించారని పేర్కొంది. అధిక రవాణా చార్జీలకు ఆమోదం ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.192 కోట్ల నష్టం వాటిల్లిందని సిట్ ఆరోపించింది.

**డబ్బు మళ్లింపుపై విచారణ**

సాక్షుల వాంగ్మూలాలు, ఆర్థిక లావాదేవీల పరిశీలన, నగదు ప్రవాహంపై విశ్లేషణ ఆధారంగా అక్రమంగా సేకరించిన నిధుల లబ్ధిదారుల్లో వాసుదేవ రెడ్డి కూడా ఉన్నారని సిట్ పేర్కొంది. ఈ నిధులను ఆయన బావమరిది పేరుతో పాటు బినామీ సంస్థలు, షెల్ కంపెనీలు, కుటుంబ వ్యాపారాల ద్వారా మళ్లించినట్లు దర్యాప్తు బృందం ఆరోపించింది. అసలు లబ్ధిదారుల వివరాలను దాచేందుకు ఈ మార్గాలను ఉపయోగించినట్లు తెలిపింది.

**కొనసాగుతోన్న దర్యాప్తు**

ప్రాసిక్యూషన్, నిందితుల తరఫు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆ తర్వాత నిందితులను తిరిగి చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించే చర్యలు అధికారులు చేపట్టారు. సిట్ రిమాండ్ నివేదికలో పేర్కొన్న ఆరోపణలు ప్రస్తుతం దర్యాప్తులో భాగమని, వాటిపై తుది నిర్ణయం న్యాయస్థానం విచారణ అనంతరమే వెలువడుతుందని స్పష్టం చేయడం గమనార్హం.

# జీవో నెం. 396ను రద్దు చేయాలి

- చీరాలలో దస్తావేజు లేఖర్ల నిరవధిక సమ్మె




**చీరాల, జులై 20 (నాదేశం) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి జారీ చేసిన జీవో నెంబర్ 396ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపు మేరకు చీరాలలో సోమవారం 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిరవధిక సమ్మె చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే "పెన్ డౌన్" కార్యక్రమంలో భాగంగా చీరాల దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సమ్మెలోకి వెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా లేఖర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతో పాటు, క్రయ విక్రయదారుల సొంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ విధానాన్ని కూడా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పేరిట ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఎన్నో ఏళ్లుగా ఈ వృత్తిపై ఆధారపడి బతుకుతున్న దస్తావేజు లేఖరులు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంపు వెండర్లు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రఫీ, హేమచంద్, జగదీష్, గుంటూరు నరసింహారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదం

- త్రిపుర డీజీపీ మృతి
- పోలీస్ శాఖలో విషాదం!



త్రిపుర... డీజీపీ అనురాగ్ ధంకర్ సోమవారం అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. అగర్తలలోని అఖౌరా రోడ్డులో ఉన్న పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం కార్యాలయానికి వచ్చిన ఆయన కొద్దిసేపటి తర్వాత తన ఛాంబర్‌కు ఆనుకుని ఉన్న వాష్‌రూమ్‌లోకి వెళ్లారు. చాలా సమయం గడిచినా బయటకు రాకపోవడంతో సిబ్బంది అనుమానించారు. చివరకు తలుపులు బలవంతంగా తెరిచి చూడగా ఆయన అపస్మారక స్థితిలో కనిపించినట్లు సమాచారం.

**ఆస్పత్రికి తరలించినా...**

అధికారులు వెంటనే అనురాగ్ ధంకర్‌ను అగర్తల మెడికల్ కాలేజ్, జీబీ పంత్ ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స కోసం ఐసీయూలో చేర్చినప్పటికీ వైద్యులు ఆయనను మృతిగా ప్రకటించారు. ఈ వార్తతో రాష్ట్ర పోలీసు శాఖతో పాటు ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. డీజీపీ మృతి వెనుక అసలు కారణాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ఈ ఘటనపై పోలీసులు అసహజ మరణంగా కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో విచారణ ప్రారంభించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు.

**18 ఏళ్ల సేవలు, ఆస్పత్రికి సీఎం**

డీజీపీ మృతి వార్త తెలిసిన వెంటనే త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ పరిస్థితిని సమీక్షించారు. సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు కూడా ఆస్పత్రికి చేరుకుని నివాళులు అర్పించారు. అనురాగ్ ధంకర్ ఆకస్మిక మరణం రాష్ట్రాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అధికారులు పేర్కొన్నారు. 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనురాగ్ ధంకర్ త్రిపురలో దాదాపు 18 సంవత్సరాలపాటు వివిధ హోదాల్లో సేవలందించారు. గత ఏడాది మే 18న రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. అనుభవజ్ఞుడైన పోలీసు అధికారిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పదవీ విరమణకు సమీపిస్తున్న సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకోవడం మరింత బాధాకరంగా మారింది.

**మిస్టరీగా మారిన ఘటన**

డీజీపీ కార్యాలయంలోనే జరిగిన ఈ అనుమానాస్పద మరణం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అత్యున్నత పోలీసు అధికారి ఆకస్మికంగా మృతి చెందడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా అసలు కారణం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టడంతో ఈ కేసుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

# పోలీస్ సంక్షేమమే ప్రాధాన్యం

రాష్ట్ర పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే తెలంగాణ పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. డీజీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్ సొసైటీ, ఆరోగ్య భద్రత విభాగాల సమీక్ష సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, పురోగతిని ఆయన పరిశీలించారు. పోలీసు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. సిబ్బందికి వివాహ, వైద్య, విద్యా రుణాలతో పాటు అదనపు కార్పస్ ఇన్సూరెన్స్, వివిధ గ్రాంట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సంక్షేమ సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసి పారదర్శకత పెంచాలని, హోదాల వారీగా వెల్ఫేర్ కమిటీల ఏర్పాటు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల లీజుల్లో పారదర్శక విధానం అమలు చేయాలని అధికారులకు డీజీపీ ఆదేశించారు.

# ఆటతోనే నా సమాధానం

## రిటైర్మెంట్ వార్తలకు రోహిత్ ఫుల్‌స్టాప్

**భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తన అంతర్జాతీయ క్రికెట్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ తర్వాత రిటైర్మెంట్ తీసుకోనున్నట్లు ప్రచారం జరిగినా వాటిని ఆయన పూర్తిగా ఖండించాడు. దేశం కోసం ఆడటమే తన ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ప్రచారంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా కూడా స్పష్టత ఇచ్చారు. ఇంగ్లండ్ సిరీస్ తర్వాత కూడా రోహిత్ భారత జట్టుకు అందుబాటులో ఉంటాడని తెలిపారు. ప్రస్తుతం రోహిత్ టీ20, టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు.**

### విమర్శలు పట్టించుకోను



బయట వినిపించే విమర్శలు, ప్రచారం తనను ఏమాత్రం ప్రభావితం చేయవని రోహిత్ స్పష్టం చేశాడు. అరంగేట్రం చేసిన రోజు నుంచి ఇలాంటి చర్చలు చూస్తూనే ఉన్నానని తెలిపాడు. తాను మైదానంలో ఎలా ఆడుతున్నాననేదే ముఖ్యమని, జట్టు విజయానికి తన వంతు సహకారం అందించడంపైనే పూర్తి దృష్టి ఉందని చెప్పాడు. బయట జరిగే చర్చలను పట్టించుకునే అలవాటు తనకు లేదని వెల్లడించాడు. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో రోహిత్ 110 బంతుల్లో 138 పరుగులు చేసి తన ఫామ్‌ను మరోసారి నిరూపించాడు. అతని ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. జట్టు ఓడినా వ్యక్తిగతంగా అద్భుత ప్రదర్శనతో విమర్శలకు బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు.

### 2027 ప్రపంచకప్ లక్ష్యం

భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా రోహిత్ రిటైర్మెంట్‌పై జట్టులో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశాడు. మరోవైపు రోహిత్ ఇప్పటికే 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలని తన లక్ష్యాన్ని వెల్లడించాడు. దేశానికి మరో ప్రపంచకప్ అందించాలనే కలతో కష్టపడతానని స్పష్టం చేసిన రోహిత్, ప్రస్తుతం తన పూర్తి దృష్టి భారత జట్టు విజయాలపైనే ఉందని మరోసారి తేల్చిచెప్పాడు.

# మెస్సీ కెరీర్‌లో వైఫల్యం!

### 20 ఏళ్ల రికార్డుకు బ్రేక్

2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా 1-0 తేడాతో ఓటమి పాలైంది. అదనపు సమయంలో ఫెర్రాన్ టోరెస్ చేసిన గోల్‌తో స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. ఈ ఓటమితో ప్రపంచ చాంపియన్‌గా అర్జెంటీనా ప్రయాణం ముగిసింది. మ్యాచ్ అనంతరం లియోనెల్ మెస్సీ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకోవడం అభిమానులను కలిచివేసింది.

### 20 ఏళ్లలో తొలిసారి

ఈ ఫైనల్ మెస్సీ కెరీర్‌లో అరుదైన రికార్డుకు ముగింపు పలికింది. ప్రపంచకప్‌లో ఆడిన మ్యాచ్‌లో ఒక్క అవకాశాన్ని కూడా సృష్టించకుండా ముగించడం ఆయన 20 ఏళ్ల ప్రపంచకప్ ప్రయాణంలో ఇదే తొలిసారి. మొత్తం 120 నిమిషాల్లో మెస్సీ కేవలం 54 సార్లు మాత్రమే బంతిని తాకాడు. ఒక్క షాట్ మాత్రమే ప్రయత్నించగా అది కూడా ప్రత్యర్థి ఆటగాళ్లతో అడ్డుకుపోయింది. ఐదు క్రాస్‌లలో ఒక్కటి మాత్రమే సరైన లక్ష్యాన్ని చేరుకుంది. ఫైనల్ మొత్తం స్పెయిన్ ఆధిపత్యం కొనసాగింది. స్పెయిన్ 65 శాతం బంతి నియంత్రణ సాధించింది. మొత్తం 20 షాట్లు కొట్టగా అర్జెంటీనా కేవలం రెండు షాట్లకే పరిమితమైంది. తొలి 90 నిమిషాల్లో అర్జెంటీనా ఒక్క షాట్ కూడా లక్ష్యంపై నమోదు చేయలేకపోయింది. రోడ్రీ నేతృత్వంలోని స్పెయిన్ మిడ్‌ఫీల్డ్ ప్రత్యర్థికి అవకాశమే ఇవ్వకుండా మ్యాచ్‌ను నియంత్రించింది.

### ముగిసిన అద్భుత పరంపర

ఈ మ్యాచ్‌తో మెస్సీ వరుసగా 11 ప్రపంచకప్ మ్యాచ్‌లలో గోల్ చేయడం లేదా గోల్‌కు సహకరించడం అనే అద్భుత పరంపర ముగిసింది. టోర్నీలో తన ప్రభావాన్ని చూపిన మెస్సీ ఫైనల్లో మాత్రం పూర్తిగా స్పెయిన్ వ్యూహాలకు చిక్కిపోయాడు. ప్రత్యర్థి రక్షణను ఛేదించడంలో విఫలమయ్యాడు. ఫైనల్లో నిరాశ ఎదురైనా టోర్నమెంట్‌లో రెండో అత్యుత్తమ ఆటగాడిగా మెస్సీ సిల్వర్ బాల్ అవార్డును అందుకున్నాడు. స్పెయిన్ కెప్టెన్ రోడ్రీ గోల్డెన్ బాల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ ఫైనల్ మెస్సీకి చివరి ప్రపంచకప్ మ్యాచ్‌గా మారే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ఒకవేళ అదే నిజమైతే ఆయన ప్రపంచకప్ కెరీర్ 21 గోల్స్, 12 అసిస్టులు, మూడు ప్రపంచకప్ ఫైనల్స్, రెండు గోల్డెన్ బాల్ అవార్డులు, ఒక ప్రపంచకప్ టైటిల్‌తో చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఫైనల్‌లో ఎదురైన అరుదైన వైఫల్యం ఆయన గొప్ప 'కెరీర్‌ను తగ్గించకపోయినా, 20 ఏళ్ల ప్రపంచకప్ ప్రయాణంలో గుర్తుండిపోయే అత్యంత నిరాశకర క్షణంగా మాత్రం నిలిచిపోతుంది.



## ఫైనల్ తర్వాత ఫుట్‌బాల్ రచ్చ

### అర్జెంటీనాకు మరో రెడ్ కార్డు

2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ ముగిసిన తర్వాత మైదానంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మ్యాచ్ ముగిసిన వెంటనే ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్పెయిన్ ఆటగాళ్లు విజయ సంబరాలు చేసుకుంటున్న సమయంలో అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోనీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ లియాండ్రో పరేడెస్ స్పెయిన్ ఆటగాళ్లు ఎరిక్ గార్సియా, గావీలతో ఘర్షణకు దిగాడు. ఈ ఘటనలో పరేడెస్‌కు మరో రెడ్ కార్డు చూపించినట్లు సమాచారం. నికోలస్ ఒటామెండి కూడా స్పెయిన్ కెప్టెన్ రోడ్రీతో వాగ్వాదానికి దిగాడు.

## ఓటమి జీర్ణించుకోలేకపోయారా ?

### రోడ్రీ అవార్డు వేళ వివాదం

టోర్నమెంట్ అత్యుత్తమ ఆటగాడిగా స్పెయిన్ స్టార్ రోడ్రీకి గోల్డెన్ బాల్ అవార్డు అందజేస్తున్న సమయంలో స్టేడియంలోని అర్జెంటీనా అభిమానులు మెస్సీ పేరు నినదించారు. ఈ ఘటన కూడా సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. విజేతను గౌరవించాల్సిన సమయంలో ఇలాంటి నినాదాలు చేయడం సరైన పద్ధతి కాదని పలువురు అభిప్రాయపడ్డారు.

### క్రీడాస్ఫూర్తిపై విమర్శలు

మ్యాచ్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాడు లియాండ్రో పరేడెస్ రెడ్ కార్డు అందుకోవడం కూడా వివాదాన్ని మరింత పెంచింది. ఫుట్ బాల్ విశ్లేషకులు అర్జెంటీనా జట్టు ప్రవర్తనను తీవ్రంగా తప్పుబట్టారు. ఓటమిని హుందాగా స్వీకరించి విజేతలను అభినందించాల్సిందని సూచించారు. మరోవైపు స్పెయిన్ అభిమానులు మాత్రం తమ జట్టు చారిత్రాత్మక విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఫైనల్ ఫలితంతో పాటు అర్జెంటీనా జట్టు వైఖరి కూడా ప్రపంచ ఫుట్ బాల్‌లో ప్రధాన చర్చగా మారింది.

### సంబరాలకు అర్జెంటీనా దూరం

2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో 1-0 తేడాతో ఓడిన అర్జెంటీనా జట్టు మ్యాచ్ అనంతరం ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. అదనపు సమయంలో ఫెర్రాన్ టోరెస్ చేసిన ఏకైక గోల్‌తో స్పెయిన్ ప్రపంచకప్‌ను



కైవసం చేసుకుంది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగిన ట్రోఫీ ప్రదానోత్సవంలో అర్జెంటీనా ఆటగాళ్ల వైఖరి చర్చనీయాంశంగా మారింది.

### ట్రోఫీ వేడుకకు దూరం

రన్నరప్ పతకాలు అందుకున్న తర్వాత స్పెయిన్ జట్టు ట్రోఫీ అందుకునే సమయంలో అర్జెంటీనా ఆటగాళ్లు మైదానంలో నిలిచి విజేతలకు అభినందనలు తెలియజేయలేదు. లియోనెల్ మెస్సీతో పాటు జట్టు సభ్యులు మరోవైపు వెళ్లిపోయారు. సాధారణంగా విజేత జట్టుకు ఇచ్చే గార్డ్ ఆఫ్ ఆనర్ కూడా ఇవ్వలేదు. దీనిపై ఫుట్ బాల్ అభిమానులు, విశ్లేషకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## కొరియన్ కనకరాజులో రాసా గుమ్మడి పాట విడుదల



'మాస్ మెచ్చే అన్ని అంశాలు ఉన్న సినిమా 'కొరియన్ కనకరాజు అన్నారు దర్శకుడు మేర్లపాక గాంధీ. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ హీరోగా నటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఆగస్టు 7న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు. 'రాసా గుమ్మడి' అంటూ రాయలసీమ జాతర నేపథ్యంలో సాగే ఈ మాస్ పాటకు తమన్ స్వరాలు సమకూర్చారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. నల్గొండ గద్దర్ ఆలపించారు. ఈ పాటలో వరుణ్ `దక్ష నగార్కర్ వేసిన మాస్ స్టెప్పులు.. వాళ్లిద్దరి కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచాయి. వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. 'ఈ పాట అందరికీ నచ్చిందనుకుంటున్నా. మా పెద్దనాన్న చిరంజీవిని దృష్టిలో పెట్టుకుని ఈ పాటకి డ్యాన్స్ చేశా' అన్నారు. 'ఇందులో వరుణ్ యాక్షన్.. సత్యతో కలిసి చేసిన కామెడీ.. అన్నీ అలరిస్తాయని అన్నారు మేర్లపాక గాంధీ.




## శ్రీనివాస మంగాపురం నుంచి రావే చెలియా పాట విడుదల

ఘట్టమనేని జయకృష్ణ హీరోగా అజయ్ భూపతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రషా థడానీ కథానాయికగా అలరించనున్నారు. జులై 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. రావే చెలియా అంటూ సాగే ఈ పాటలో 'నా ప్రాణం నను వీడి.. నీ వైపే కదిలేనే' అనే లిరిక్స్ యూత్‌ను ఆకట్టుకుంటున్నాయి.

రాకా మూవీలో జాయిన్ అయిన

# నటి సిరి హన్మంతు

**టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న 'చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.**





# మెగా విజయం

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా రూపొందించిన 'కమిటీ కుర్రోళ్ళు' చిత్రం జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యంతో, కొత్త నటీనటులతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రతిష్ఠాత్మక 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు అవార్డులు గెలుచుకుని తెలుగు సినీ పరిశ్రమకు మరోసారి గర్వకారణంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం ప్రత్యేక సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మాట్లాడిన నిర్మాత నిహారిక కొణిదెల తన ఆనందాన్ని భావోద్వేగంతో పంచుకున్నారు. తమ కుటుంబానికి జాతీయ అవార్డులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ.. సరిగ్గా 36 ఏళ్ల క్రితం మా నాన్న నాగబాబు నిర్మాతగా రూపొందించిన తొలి చిత్రం 'రుద్రవీణ' మూడు జాతీయ అవార్డులు అందుకుంది. ఇప్పుడు నేను నిర్మాతగా పూర్తి బాధ్యతతో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' కూడా రెండు జాతీయ అవార్డులు గెలుచుకోవడం ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. నేషనల్ అవార్డు సాధించాలనే లక్ష్యంతో ఈ సినిమాను ప్రారంభించలేదని, అయితే దర్శకుడు యదు వంశీ చెప్పిన కథ విన్న తర్వాత ఈ చిత్రాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే బలమైన కోరిక తనలో కలిగిం దని నిహారిక వెల్లడిం చారు. ఇప్పుడు ఆ కల నిజం కావడం ఎంతో సంతృప్తిని స్తోందని చెప్పారు. ఈ అరుదైన విజయంపై మెగాస్టార్ చిరంజీవి కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేశారని, ఆయన నుంచి వచ్చిన ప్రశంసలు తనకు మరింత ప్రేరణనిచ్చాయని నిహారిక తెలిపారు.

# పీవీ సింధుకు రాజమౌళి శుభాకాంక్షలు

**• మీ మూవీలో పరిచయ నటిగా ఛాన్స్ ఇమ్మంటూ షట్లర్ రిప్లై**





జపాన్ ఓపెన్ టైటిల్ విజేతగా నిలిచి భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగు తేజంపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో అగ్ర దర్శకుడు రాజమౌళి పోస్ట్‌కు సింధు ఇచ్చిన రిప్లై అందరినీ ఆకర్షిస్తూనే నెట్టింట ఆసక్తికర చర్చకు దారి తీసింది. సింధును అభినందిస్తూ రాజమౌళి ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. జపాన్ ఓపెన్ గెలిచిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించావు. మంచి కమ్ బ్యాక్ ఇచ్చావు. కంగ్రాట్స్ సింధు. నిన్ను చూసి దేశం గర్విస్తోందని శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందించిన ఆమె.. ధన్యవాదాలు రాజమౌళి సర్. మీ వారణాసి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఒకవేళ మీరు తెరకెక్కించే ఏ సినిమాలో అయినా బ్యాడ్మింటన్ ప్లేయర్ పాత్ర ఉంటే.. మీ పరిచయ నటిగా మారడానికి నేను ఎంతో సంతోషిస్తాను' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పంచుకున్నారు. ప్రస్తుతం సింధు రిప్లై నెట్టింట వైరల్ అవుతుండగా.. త్వరలోనే సినిమాల్లోకి రానుందా అనే చర్చ మొదలైంది. రాజమౌళికి క్రీడాకారుల నుంచి ఈ తరహా రిక్వెస్ట్‌లు రావడం ఇదేం తొలిసారి కాదు. గతంలో ఆస్ట్రేయా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా జక్కన్నకు ఇలాంటి రిప్లై ఇచ్చారు. తెలుగు సినిమా పాటలకు తనదైన స్టైల్‌లో డ్యాన్స్ వేస్తూ పోస్ట్‌లు పెట్టే వార్నర్‌కు.. మన దర్శకధీరుడు 'బాహుబలి' కీరిటాన్ని కూడా పంపారు. ఇక 'వారణాసి' విషయానికొస్తే.. దీని షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. అక్టోబర్ నాటికి పూర్తి చేసి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ చేయనున్నారు.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085



పూణెలో సంచలనం సృష్టించిన కేతన్ అగర్వాల్ హత్య కేసులో ప్రధాన నిందితురాలు సియా పోలీసులకు చెప్పిన ఒక్క మాట దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. "పెళ్లి వద్దని మా తల్లిదండ్రులను ఒప్పించడం కంటే... అతడిని చంపేయడం సులభంగా అనిపించింది" అనే ఆమె వ్యాఖ్య కేవలం ఒక నేరస్తురాలి ఆలోచన కాదు. కుటుంబాల్లో పెరుగుతున్న భావోద్వేగ దూరానికి అద్దం పట్టే విషాద సంకేతం. పిల్లలు తమ మనసులోని మాటను తల్లిదండ్రులతో చెప్పడానికి భయపడే పరిస్థితి ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేసింది. నచ్చని నిర్ణయాన్ని వ్యతిరేకించే ధైర్యం కంటే, తప్ప మార్గాన్ని ఎంచుకునే స్థితికి యువత చేరుకోవడం వెనుక పెంపకం, కుటుంబ సంభాషణలు, సామాజిక ఒత్తిళ్లు ఎంత ప్రభావం చూపుతున్నాయనే ప్రశ్న ఇప్పుడు ప్రతి ఇంటి ముందు నిలిచింది. సియా చేసిన నేరాన్ని సమర్థించే అవకాశం లేదు. కానీ అలాంటి ఆలోచనకు దారి తీసిన కుటుంబ వాతావరణాన్ని మాత్రం సమాజం తప్పకుండా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. పిల్లలకు ఆస్తులు కంటే, భయపడకుండా మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వడమే నిజమైన పెంపకం అని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.

## మీ పిల్లల నిశ్శబ్దం...

# మీ పెంపకానికి హెచ్చరిక!

- భయం పెరిగితే బంధం కరుగుతుంది
- మాటలే కుటుంబాలకు అసలు రక్షణ
- మనసులు దూరమైతే... నేరాలు దగ్గరవుతాయి

ఒక పిల్లవాడు లేదా పిల్ల తన జీవితంలో ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యను ముందుగా చెప్పాల్సిన వ్యక్తులు తల్లిదండ్రులే. కానీ అదే పిల్లలు తమ మనసులోని నిజాన్ని ఇంట్లో చెప్పడానికి భయపడితే, అది కుటుంబానికి అత్యంత ప్రమాదకరమైన హెచ్చరిక. పూణెలో వెలుగులోకి వచ్చిన సియా కేసు కూడా అలాంటి బాధాకరమైన వాస్తవాన్నే మన కళ్లముందు ఉంచింది. ఒక యువతి తనకు ఇష్టం లేని పెళ్లిని నిరాకరించే ధైర్యం కంటే, ప్రాణం తీయడమే సులభమని భావించే స్థితికి చేరుకుందంటే, అది ఒక్క వ్యక్తి తీసుకున్న తప్పు నిర్ణయం మాత్రమే కాదు. కుటుంబాల్లో పెరుగుతున్న భావోద్వేగ దూరం, వినిపించని మాటలు, అర్థం కాని మనసులు, పరువు పేరుతో పెరుగుతున్న ఒత్తిళ్లకు ప్రతిబింబం. పిల్లలకు తిండి, చదువు, సౌకర్యాలు కల్పించడం మాత్రమే పెంపకం కాదు. వారు ఏడ్చినప్పుడు వినే చెవులు, భయపడినప్పుడు ధైర్యం చెప్పే మాటలు, తప్పు చేసినా నిజం చెప్పే నమ్మకం ఇవ్వడం కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే ఇంట్లో మాట్లాడే అవకాశం కోల్పోయిన పిల్లలు బయట ప్రపంచంలో తప్పు దారులు వెతికే ప్రమాదం పెరుగుతుంది. ప్రతి తల్లిదండ్రి ఒక్కసారి తమను తాము ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది. నా పిల్లలకు నేను భయమా... లేక భరోసానా? అదే ప్రశ్నకు వచ్చే సమాధానమే రేపటి సమాజాన్ని నిర్ణయించబోతోంది.

### • హత్యకంటే భయమే పెద్ద శత్రువు!

మహారాష్ట్రలోని పూణెలో ప్రముఖ వ్యాపారవేత్త కుమారుడు కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఆ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న సియా పోలీసులకు చెప్పిన ఒక్క వాక్యం మాత్రం సమాజాన్ని మరింత ఆలోచింపజేసింది. "పెళ్లి వద్దని నా తల్లిదండ్రులను ఒప్పించడం కంటే... నాకు కాబోయే భర్తను చంపడం సులభంగా అనిపించింది" అనే మాట కేవలం ఒక కేసుకు సంబంధించిన స్టేట్ మెంట్ కాదు. అది ఎన్నో కుటుంబాల్లో నిశ్శబ్దంగా పెరుగుతున్న కమ్యూనికేషన్ సంక్షోభానికి అద్దం పట్టింది. ఒక యువతి తన మనసులోని మాటను తల్లిదండ్రులకు చెప్పడం కంటే హత్యను సులభమైన మార్గంగా భావించే స్థితికి చేరుకుందంటే, అది ఒక్క వ్యక్తి వైఫల్యం కాదు. కుటుంబ బంధాలు, పెంపక విధానాలు, సామాజిక ఒత్తిళ్లు, భావోద్వేగ అనుబంధాలు కలిసి సృష్టించిన ప్రమాదకర పరిస్థితి. సియా చేసిన నేరాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేం. చట్టం తన పని చేస్తుంది. కానీ ఆ నేరం వెనుక దాగి ఉన్న మానసిక కారణాలను అర్థం చేసుకోవడం మాత్రం సమాజానికి అత్యంత అవసరం.

### • మానసిక ఒత్తిడి ఎలా ప్రమాదంగా మారుతుంది?

సియా చెప్పిన మాటలో అసలు భయం హత్య కాదు. తల్లిదండ్రులతో మాట్లాడలేకపోవడమే. మనసులోని నిజాన్ని చెప్పడానికి ధైర్యం లేకపోవడం అంతకంటే పెద్ద విషాదం.
పిల్లలు తమ సమస్యలను ముందుగా ఇంట్లో చెప్పగలగాలి. కానీ కొందరి జీవితాల్లో ఇంటి తలుపులు తెరిచి ఉన్నా, సంభాషణల తలుపులు మూసుకుపోతాయి. అలాంటి పరిస్థితుల్లో భయం పెరుగుతుంది. ఆ భయం నిర్ణయాలను వికృతంగా మార్చేస్తుంది.
ప్రతి ఇంట్లోనూ పిల్లలు తల్లిదండ్రులను ఆశ్రయంగా చూడాలి. తీర్పు చెప్పే న్యాయమూర్తులుగా కాదు. ఒక కుటుంబంలో మాటలు తగ్గిన క్షణం నుంచి అపార్థాలు పెరుగుతాయి. అపార్థాలు పెరిగిన చోట భయం పుడుతుంది. భయం పెరిగితే తప్పు నిర్ణయాలకు అవకాశం పెరుగుతుంది. తీవ్రమైన మానసిక ఒత్తిడిలో మనిషి మెదడు సాధారణంగా పనిచేయదు. సైకాలజీలో దీనిని "టన్నెల్ విజన్" అని వివరిస్తారు. అంటే సమస్యకు ఎన్నో పరిష్కారాలు ఉన్నప్పటికీ మెదడు ఒక్క దారినే చూస్తుంది. అది సరైనదా, తప్పా అనే విశ్లేషణ చేసే సామర్థ్యం తగ్గిపోతుంది. సియా పరిస్థితిలో కూడా ఇదే జరిగి ఉండొచ్చు. పెళ్లిని నిరాకరించడం, ఇంట్లో మాట్లాడటం, బంధువుల సహాయం తీసుకోవడం, చట్టపరమైన మార్గాలు అనుసరించడం వంటి ఎన్నో అవకాశాలు ఉన్నా, తీవ్రమైన భావోద్వేగ ఒత్తిడి కారణంగా అవన్నీ ఆమెకు కనిపించకపోయి ఉండవచ్చు. ఒకే ఒక్క తప్పు నిర్ణయం మాత్రమే సమస్యకు పరిష్కారమని మెదడు నమ్మే స్థితి అత్యంత ప్రమాదకరం.

### • పెంపకంలో మాటలకు స్థానం లేకపోతే...

చిన్నప్పటి నుంచి ప్రతి నిర్ణయం తల్లిదండ్రులదే. పిల్లల అభిప్రాయానికి విలువ ఉండదు. ఏదైనా చెప్పాలంటే "నీకు ఏమి తెలుసు?", "మేము చెప్పిందే చివరి మాట" అనే స్పందన వస్తుంది.
ఇలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లలు క్రమంగా తమ భావాలను దాచుకోవడం నేర్చుకుంటారు. ప్రముఖ సైకాలజిస్ట్ మార్టిన్ సెలిగ్‌మన్ ప్రతిపాదించిన లెర్న్డ్ హెల్ప్‌లెస్‌నెస్ సిద్ధాంతం ప్రకారం, పదేపదే తమ అభిప్రాయాలు తిరస్కరించబడుతున్న అనుభవం ఎదురైతే, చివరకు "నేను చెప్పినా ఉపయోగం లేదు" అనే నిస్సహాయ భావన ఏర్పడుతుంది. అదే భావన తర్వాత జీవితంలోని కీలక నిర్ణయాల వద్ద కూడా వెంటాడుతుంది. పిల్లలు మాట్లాడకపోవడం వారి మొండితనం కాదు. చాలాసార్లు అది వినబడకపోయిన అనుభవాల ఫలితం. హ్యూమనిస్టిక్ సైకాలజిస్ట్ కార్ల్ రోజర్స్ చెప్పిన ముఖ్యమైన అంశం ఒకటే. పిల్లలపై ప్రేమ ఎలాంటి షరతులు లేకుండా ఉండాలి. కానీ చాలాచోట్ల ప్రేమకు కూడా అర్హత పరీక్షలు పెడుతున్నారు. "మా మాట వినాలి." "మా పరువు కాపాడాలి." "మేము చెప్పిందే చేయాలి." ఇలాంటి వాక్యాలు ప్రేమను నెమ్మదిగా భయంగా మారుస్తాయి. పిల్లలు తల్లిదండ్రులను కోల్పోతామనే భయంతో నిజాలు దాచడం ప్రారంభిస్తారు. చివరకు చిన్న సమస్య కూడా పెద్ద సంక్షోభంగా మారుతుంది. పిల్లలకు అవసరమైనది నియంత్రణ కాదు. అర్థం చేసుకునే మనసు. డిజిటల్ ప్రపంచం దగ్గరైంది... మనుషులు దూరమయ్యారు. స్మార్ట్‌ఫోన్‌లు కుటుంబ సభ్యులను ఒకే ఇంట్లో ఉంచుతున్నాయి. కానీ భావోద్వేగంగా కలపడం లేదు. ప్రతి ఒక్కరూ తమ స్క్రీన్‌లో బిజీగా ఉంటున్నారు. కుటుంబ సంభాషణలు క్రమంగా తగ్గిపోతున్నాయి. వివిధ అధ్యయనాలు యువతలో కుటుంబ సభ్యులతో భావోద్వేగంగా మాట్లాడే అలవాటు తగ్గుతోందని సూచిస్తున్నాయి. కెరీర్, ప్రేమ, పెళ్లి, వ్యక్తిగత నిర్ణయాల విషయంలో చాలామంది యువత తల్లిదండ్రులతో మాట్లాడేందుకు సంకోచిస్తున్నారు. బయట ప్రపంచంతో వేల గంటలు గడిపే పిల్లలు ఇంట్లో ఐదు నిమిషాలు కూడా మనసు విప్పలేకపోవడం ఆందోళనకర పరిణామం. సాంకేతికత పెరగడం తప్పు కాదు. సంబంధాలు తగ్గిపోవడమే అసలు సమస్య.

### • 'నలుగురు ఏమంటారు?' అనే భయం

మన సమాజంలో ఇప్పటికీ అనేక నిర్ణయాలు కుటుంబ సభ్యుల సంతోషం కోసం కాకుండా, ఇతరుల అభిప్రాయాల కోసం తీసుకుంటున్నారు. "ఇంటి పరువు", "కుటుంబ గౌరవం", "సమాజం ఏమంటుంది?" అనే మాటలు ఎన్నో యువజీవితాలను మౌనంగా నలిపేస్తున్నాయి. పిల్లల మనసు వినకుండా, సమాజం మాట వినడం వల్ల చాలా కుటుంబాలు విలువైన అనుబంధాలను కోల్పోతున్నాయి. పరువు కాపాడుకోవాలనే ఆందోళన కొన్నిసార్లు పిల్లల జీవితాలను ప్రమాదంలోకి నెడుతుంది. సమాజం ఒక రోజు మాట్లాడి మరిచిపోతుంది. కానీ కుటుంబ నిర్ణయాల ప్రభావం పిల్లల జీవితమంతా ఉంటుంది. మార్కుల కంటే మాటలకు విలువ ఇవ్వండి. తల్లిదండ్రులు పిల్లల చదువు కోసం లక్షలు ఖర్చు పెడుతున్నారు. మంచి పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. కానీ



ప్రతిరోజూ ప్రశాంతంగా కూర్చొని అరగంట మాట్లాడే సమయం మాత్రం దొరకడం లేదు. పిల్లలకు జీవితంలో గొప్ప బహుమతి ఖరీదైన వస్తువులు కావు. "నువ్వు ఏ విషయం అయినా నాతో చెప్పొచ్చు" అనే నమ్మకం. ఒక కుటుంబంలో ప్రతి రోజు కొన్ని నిమిషాల నిజాయితీతో కూడిన సంభాషణ జరిగితే, అనేక సమస్యలు మొదట్లోనే పరిష్కారమవుతాయి. తప్పు జరిగిన వెంటనే కోపంతో స్పందించడం చాలా సహజం. కానీ ఆ క్షణంలో పిల్లలకు అత్యంత అవసరమైనది శిక్ష కాదు. వినే వ్యక్తి. వారు ఎందుకు ఆ నిర్ణయం తీసుకున్నారు? ఏ పరిస్థితి వారిని అక్కడికి తీసుకెళ్లింది? ఎవరైనా ఒత్తిడి చేశారా? ఏ భయం వెంటాడుతోంది? ముందుగా ఇవన్నీ తెలుసుకోవాలి. "నువ్వు తప్పు చేసినా నేను నీతోనే ఉంటాను. ముందు నిజం చెప్పు" అనే మాట ఎన్నో ప్రమాదాలను ముందుగానే అడ్డుకోగలదు. భయం నిజాలను దాచిస్తుంది. నమ్మకం నిజాలను బయటకు తీసుకొస్తుంది. కొంతమంది తల్లిదండ్రులు స్వేచ్ఛ ఇస్తే పిల్లలు తప్పుదారి పడతారని భావిస్తారు. కానీ స్వేచ్ఛ అంటే బాధ్యతతో కూడిన సంభాషణకు అవకాశం ఇవ్వడం. చిన్న విషయాల నుంచి పిల్లల అభిప్రాయాలను అడగండి. కుటుంబ నిర్ణయాల్లో వారిని భాగస్వాములను చేయండి. వారి ఆలోచన సరైనదైతే ప్రోత్సహించండి. తప్పైతే ప్రశాంతంగా వివరించండి. అవమానించడం, ఎగతాళి చేయడం, అణచివేయడం సమస్యను మరింత పెంచుతుంది. తప్పును సరిదిద్దడం లక్ష్యం కావాలి. వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడం కాదు.

### • సమాజానికి శాపంగా మానవ సంబంధాలు

నేరం వెనుక దాగిన భయం: సియా చేసిన నేరం అత్యంత ఘోరం. కానీ ఆమె పోలీసులకు చెప్పిన మాట ఒక యువతి తన తల్లిదండ్రులతో మాట్లాడటానికే ఎంత భయపడిందో చూపించింది. ఈ కేసు నేరం కంటే కుటుంబాల్లో పెరుగుతున్న కమ్యూనికేషన్ లోపంపై పెద్ద చర్చకు తెరతీసింది.
పెంపకం ప్రభావం: పిల్లల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా, ప్రతి నిర్ణయాన్ని తల్లిదండ్రులే తీసుకునే వాతావరణం వారిలో నిస్సహాయ భావనను పెంచుతుంది. చివరకు తమ సమస్యలకు సరైన పరిష్కారం కనిపించకుండా తప్పు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంటుంది.
మానసిక ఒత్తిడి ప్రమాదం: తీవ్రమైన ఒత్తిడి సమయంలో మెదడు ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించలేని స్థితిని సైకాలజీలో "టన్నెల్ విజన్"గా పేర్కొంటారు. అదే పరిస్థితి ఒక వ్యక్తిని తీవ్ర నిర్ణయాల వైపు నడిపించే అవకాశం ఉంటుంది.
సమాజం పేరుతో ఒత్తిడి: "నలుగురు ఏమంటారు?" అనే భయం ఇప్పటికీ అనేక కుటుంబాల్లో పిల్లల అభిప్రాయాల కంటే పెద్దదిగా మారింది. పరువు కోసం తీసుకునే నిర్ణయాలు కొన్నిసార్లు పిల్లల జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నాయి.
పరిష్కారం సంభాషణే: పిల్లలకు ఖరీదైన సౌకర్యాల కంటే, భయపడకుండా మాట్లాడే వాతావరణం అవసరం. తల్లిదండ్రులు ముందుగా వినడం, అర్థం చేసుకోవడం, నమ్మకం కల్పించడం ద్వారా ఇలాంటి విషాద పరిస్థితులను చాలా వరకు నివారించవచ్చు.

### • మాటలేని ఇల్లు... మనసులేని పెంపకం!

సియా కేసు మనకు ఒక గట్టి హెచ్చరిక. ఒక యువతి తీసుకున్న నిర్ణయం నేరం. అందుకు చట్టపరమైన శిక్ష తప్పదు. కానీ ఆ స్థాయికి ఆమెను తీసుకెళ్లిన కుటుంబ సంభాషణల లోపం, భావోద్వేగ దూరం, సామాజిక ఒత్తిళ్లను కూడా మనం ప్రశ్నించాలి. రేపటి తరాన్ని కాపాడాలంటే పాఠశాలల్లో మాత్రమే కాదు, ప్రతి ఇంట్లో భావోద్వేగ విద్య అవసరం. పిల్లలకు వినిపించే తల్లిదండ్రులు కావాలి. భయపెట్టే తల్లిదండ్రులు కాదు. ప్రశ్నలు అడగడానికి స్వేచ్ఛ ఉండాలి. అభిప్రాయాలు చెప్పడానికి అవకాశం ఉండాలి. విభేదాలను సంభాషణతో పరిష్కరించే సంస్కృతి పెరగాలి. ఒక కుటుంబం బలంగా ఉండాలంటే ప్రేమ సరిపోదు. ఆ ప్రేమను వ్యక్తం చేసే మాటలు కూడా ఉండాలి. పిల్లలు ఇంటిని ప్రపంచంలోనే అత్యంత సురక్షిత ప్రదేశంగా భావించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుంది. చివరిగా ఒక విషయం మాత్రం ప్రతి తల్లిదండ్రి గుర్తుంచుకోవాలి. మీ పిల్లలు మీతో మాట్లాడటానికి భయపడుతున్నారంటే... మీ పెంపకం గెలిచినట్టు కాదు. ఓడిపోతున్నట్టు. సియా చేసిన నేరాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేం. ఒక ప్రాణాన్ని బలిగొన్న ఈ ఘటనకు చట్టం ప్రకారం శిక్ష తప్పదు. కానీ ఈ కేసును కేవలం నేర ఘటనగా చూసి ముందుకు వెళ్లిపోతే, సమాజంగా మనం మరో పెద్ద తప్పు చేసినట్టే అవుతుంది. ఎందుకంటే ప్రతి సంచలన నేరం వెనుక ఒక కనిపించని కుటుంబ కథ, వినిపించని మనసు, చెప్పుకోలేని బాధ దాగి ఉండే అవకాశం ఉంది. పిల్లలకు మంచి చదువు, మంచి భవిష్యత్తు, విలాసవంతమైన జీవితం ఇవ్వాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. కానీ వారు ఏ పరిస్థితిలోనైనా భయపడకుండా వచ్చి మాట్లాడగలిగే వ్యక్తిగా నిలవడం అంతకంటే గొప్ప బాధ్యత. ఇంట్లో సంభాషణలు ఆగిపోయిన చోట అపార్థాలు మొదలవుతాయి. అపార్థాలు పెరిగిన చోట ఒత్తిడి పెరుగుతుంది. ఒత్తిడి పెరిగినప్పుడు తప్పు నిర్ణయాల ప్రమాదం కూడా పెరుగుతుంది. రేపటి తరం మానసికంగా ఆరోగ్యంగా, బాధ్యతాయుతంగా ఎదగాలంటే ప్రతి ఇంట్లో ప్రేమతో కూడిన సంభాషణలు మొదలుకావాలి. పిల్లలు తమ తల్లిదండ్రులను భయపడే వ్యక్తులుగా కాదు, జీవితంలో ఏ సమస్య వచ్చినా ముందుగా ఆశ్రయించే మనుషులుగా చూడాలి. గుర్తుంచుకోండి... మీ పిల్లలు మీతో మాట్లాడటానికి భయపడుతున్నారంటే, అది వారి ఓటమి కాదు... మీ పెంపకానికి వచ్చిన హెచ్చరిక.

- టీ.కే.రావు,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్
(9908816036)

